25. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 289 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

- పెద్ద ఎత్తున ఇవి ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహీంద్రా తదితర కంపెనీలు
- రవాణామంత్రిపొన్నంప్రభాకర్

**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:**



హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) 2లో..

# బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్



- ఏం తప్పు చేశామని అంతలా విమర్శలు
- విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడం తప్పా
- మహిళలను కోటీశ్వరులను చేయాలనుకోవడం తప్పా
- బీమా పథకంలో ఆదుకోవాలనుకోవడం సరికాదా
- బడ్జెట్ ప్రతులు చించి ఎందుకు పారిపోయారు
- గతంలో అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి ఉండేదా

### బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బిఆర్ఎస్‌పై భట్టి చురకలు

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):** బడ్జెట్‌లో మేం ఏం తప్పు చేశామని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వడాన్ని కూడా ఓర్వలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించడం నేరమా అని నిలదీశారు. కుటుంబంలో పెద్ద మరణిస్తే.. ఆ కుటుంబ పరిస్థితి తలకిందులైపోతుంది. అలాంటి కుటుంబాలకు ఆర్థిక సమస్యలు ఉండకూడదని బీమా కల్పించాం. సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే.. వినడానికి బీఆర్ఎస్‌కు సమయం లేదా? క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కావాలని ఉద్యోగులు పదేళ్ల నుంచి అడుగుతూనే ఉన్నారు. గతంలో వారు మాట్లాడేందుకు కూడా భయపడే పరిస్థితి కల్పించారు. గతంలో నేను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. డిప్యూటీ సీఎం హోదాలో బడ్జెట్ ప్రవేశ పెడితే.. బడ్జెట్ పత్రాలు చించి సభ నుంచి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ సభ్యులు చెప్పిందే మేం వినాలి.. వినకపోతే మేం వెళ్లిపోతామంటున్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని చులకనగా చూడకండి అంటూ భట్టి చురకలంటించారు. రైతు భరోసా పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల స్కీమ్‌గా మార్చుకుంది. 2018లో ప్రజలు ఓట్లేసేందుకు క్యూలైన్‌లో ఉండగా.. రైతు భరోసా నిధులు జమచేశారు. మేం ఎప్పుడూ ఎన్నికల కోసం రైతు భరోసా నిధులు జమచేయలేదు. రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం. 2లో..

## త్వరలో "సాదాబైనామా" పరిష్కారం

- కొనుగోలుదారు అఫ్పిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీ.ఓ. 76
- శాసన మండలిలో మాత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**



రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్ లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి గారు సమాధానం ఇస్తూ, ఆనాటి బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్.ఓ.ఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. 2లో..



## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

- ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

**న్యూఢిల్లీ,మార్చి24( వెలుతురు):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు ఫోన్ చేశారు. 2లో..



# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మత్‌స్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మార్చి24 వెలుతురు:** మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగలశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల 2లో..

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

- కోవిడ్ తరహా సంక్షోభం
- నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ ?



**న్యూఢిల్లీ,మార్చి24 వెలుతురు:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం 2లో..

హలో జర్నలిస్టు..... ఛలో హైద్రాబాద్....

మార్చి 25న ఛలో సమాచార భవన్

జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వివక్ష నిర్లక్ష్య వైఖరికి నిరసనగా...

డిమాండ్స్ :

- జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి.
- చిన్న మధ్య తరహా పత్రికల అడ్వర్టైజ్‌మెంట్ల బిల్లులు బకాయిలు వెంటనే చెల్లించాలి.
- అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి.
- అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి.
- సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలి
- చిన్న మధ్యతరహా పత్రికలను ఎంపానల్‌మెంట్ జాబితాలో చేర్చాలి.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF)

9100933723

# జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి
- తనను పార్టీలో కావాలనే దూరం పెట్టారన్న ఆవేదన
- నేడు పార్టీ కార్యకర్తలతో భేటీకి పిలుపు



**జగిత్యాల,మార్చి24 వెలుతురు:** తన పదేళ్ల ఒంటరి పోరును పార్టీ అధిష్ఠానం చిన్నచూపు చూసిం దని 2లో..

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఆరువేల పెన్షన్ హామీ ఏమయ్యింది
- దివ్యాంగులకు మద్దతుగా నేడు ఇందిరాపార్క్ వద్ద ధర్నా
- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో..

## పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

- పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్దాం
- గెలుపే లక్ష్యంగా స్థానిక పోరుకు సిద్ధమవ్వండి
- నిలబడిన ప్రతి చోటా జనసేన జెండా ఎగిరేలా కష్టపడండి
- నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి
- వారంలో ఒకరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం తప్పనిసరి
- పార్టీ బలంగా ఉంటేనే ప్రజాప్రతినిధులు బలంగా ఉంటారు
- పార్టీ నేతలకు జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం

**విజయవాడ,మార్చి24 వెలుతురు:**



నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, 2లో..

## దివ్యాంగులను మోసం చేసిన కాంగ్రెస్

**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:**

దాదాపు ఆరున్నర, 7 లక్షల మంది దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ చాలా వాగ్దానాలు ఇచ్చింది. 100 రోజుల్లోనే 6 వేల పెన్షన్ అని చెప్పింది. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ దివ్యాంగులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చింది. బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో, చదువుల విషయంలో కానీ చాలా చాలా వాగ్దానాలు వారి అభయహస్తం మేనిఫెస్టోలో చాలా వివరంగా ఇచ్చారు. అవన్నీ కూడా మా సోదరుల దగ్గర చాలా వివరంగా వారి ఫోన్లలో, వారి మనసుల్లో ముద్రించుకొని పోయి ఉన్నయి. తెల్లారి లేస్తే శారీరకంగా అవస్థలు పడే దివ్యాంగులు కోరుతున్నది ప్రత్యేకంగా కొత్తగా ఏం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ పార్టీగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని వారు ఇవాళ అసెంబ్లీలోకి రావాలని ప్రయత్నం చేశారు. నేనడిగాను అసెంబ్లీలో లోపలికి రానీయండి.. మా లెసిస్లేచర్ పార్టీ ఆఫీస్‌లో కలుద్దాం. వారు బయట రోడ్డు మీద కలవటం కరెక్టు కాదు. కానీ వీళ్లంతా వస్తే మాకేదో ఇబ్బంది అయితది. వాళ్లను వద్దు అని చెప్పి పాసులు కూడా ఇయ్యకుండా సతాయిస్తే వారిని నడిరోడ్డుమీద కలవాల్సిన దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ మండిపడ్డారు. దివ్యాంగుల గురించి కళ్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు పొంది గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని మేం ఈ బ్జడెట్ సెషన్‌లో అడుగుతాం.. నిలదీస్తాం. రూ.6 వేల పెన్షన్ ఇంకా ఎందుకివ్వడం లేదు. పక్క రాష్ట్రంలో రూ.6 వేల పెన్సన్ ఇస్తున్నరు. మీరు గద్దెనెక్కిన తర్వాత మూడో బ్జడెట్ ఇది 60 శాతం సమయం అయిపోయిన తర్వాత కూడా ఎందుకు ఇంకా డబ్బులు కేటాయించడం లేదు. నిలదీస్తాం. దీంతోపాటు దివ్యాంగులకు గతంలో మేం డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చి ఆదుకునే ప్రయత్నం చేసినం. ప్రతీ దాంట్లో కోటా పెట్టి వారిని ఆదుకునే ప్రయత్నం చేశాం. భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ చేస్తాం. కానీ ఈ ప్రభుత్వం దివ్యాంగ సోదరసోదరీమణులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. నేడు ఇందిరాపార్క్ దగ్గర వాళ్లు రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చారు దానికి కూడా మా మద్దతు ఉంటుంది. పార్టీ నాయకులం కూడా హాజరవుతాం. తప్పకుండా దాన్ని కూడా విజయవంతం చేయాల్సిందిగా దివ్యాంగ సోదరులను విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్

పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి తెరిపించాల్సిన అవసరంపై ఇరువురు నేతలు చర్చించారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడే ప్రధాని మోదీతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరంతో పాటు పశ్చిమాసియాలో పరిస్థితిపై ఉభయులూ చర్చించారు' అని సెర్గియో గోర్ ఆ ప్రకటనలో తెలిపారు. రాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఐదు రోజులపాటు దాడులు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ సోమవారంనాడు సంచలన ప్రకటన చేశారు. రెండ్రోజులుగా ఇరాన్‌తో జరుపుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే అమెరికాతో చర్చలను ఇరాన్ కొట్టివేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోనులో సంభాషించినట్టు ప్రధానమంత్రి మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై తమ మధ్య ఉపయోగకరమైన చర్చ జరిగిందన్నారు. వీలైనంత త్వరలో ఉద్రికతలు తొలగేందుకు, శాంతి పునరుద్ధరణకు భారత్ మద్దతు ఉంటుందని తాను స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి తెరవడం, రక్షణ కల్పించడం, అందరికీ అందుబాటులోకి తేవడం యావత్ ప్రపంచానికి అవసరమని పేర్కొన్నారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబోయే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్త్రవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్త్రవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. క్రైస్త్రవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. క్రైస్త్రవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా క్రైస్త్రవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సమీక్షా సమావేశం లో ప్రభుత్వం ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు , హైర్ లేదా డిపా÷-టం÷-మెంట్ లు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాపేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

## బడ్జెట్‌ను కూడా జీర్ణించుకోలేని బిఆర్ఎస్

రైతులకు ఉచిత కరెంట్ పథకం పేటెంట్ హక్కు మాదే. వ్యవసాయాన్ని పండగలా చేసిందే కాంగ్రెస్. మా ప్రభుత్వం రాగానే రైతులకు ఒకేసారి రుణమాఫీ చేసింది. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదన్నదే బీఆర్ఎస్ ఆలోచన అంటూ దుయ్యబట్టారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం అని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలను, ఉద్యోగులను నిర్బంధించిన వారు.. ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బ్జడెట్‌ను వినే ఓపిక లేక సభ నుంచి వెళ్ళిపోవడం వారి అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న నాకు జరిగిన అవమానాలు రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. ప్రజల సమస్యల కోసం మైక్ అడిగితే ఇవ్వని వారు, నేడు మేము ప్రతి అంశానికి సమాధానం ఇస్తామన్నా వినకుండా పారిపోతున్నారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, తమ ఆలోచనలన్నీ ప్రజల అవసరాల చుట్టూనే తిరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని భట్టి తెలిపారు. ఏదైనా కారణంతో ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదన్న ఉద్దేశంతో రూ. 1.20 కోట్ల ప్రమాద భీమా కల్పించామని, దీనివల్ల 7.50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. గతంలో ఉద్యోగులను హౌస్ అరెస్టులు చేసి, భయం భయంగా బతికించిన బీఆర్ఎస్ నేతలకు ఈ సంక్షేమం ఇష్టం లేకే సభను వీడారని విమర్శించారు. పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో బడికి రావద్దన్న ఆలోచనతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందించాలని నిర్ణయించామన్నారు. అంతేకాకుండా, ఇంటర్ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని, ఈ అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షం బ్జడెట్ కాగితాలు చించి చెవిలో పెట్టుకుని వెళ్ళిపోయారని ఎద్దేవా చేశారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని చెబుతూ, ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని, గత ప్రభుత్వంలాగా ఓట్ల కోసం ఔటర్ రింగ్ రోడ్డును కుదువబెట్టి డబ్బులు పంచే సంస్కృతి తమది కాదని హితవు పలికారు. సన్నధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. మత, ప్రాంత భేదం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం వంటి పథకాల కోసం రూ. 50 వేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క వివరించారు. వ్యక్తులుగా తాము చిన్నవాళ్ళం కావచ్చు కానీ, తాము చేపట్టిన ప్రజాస్వామ్య పక్రియను మన్నించి చర్చలో పాల్గొనాల్సింది పోయి, 'ఆడలేక మధ్యలో ఓడు' అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.

## త్వరలో "సాదాబైనామా" పరిష్కారం

భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫ్ఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76 ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు.

ఆధార్ మాదిరిగానే భూధార్:

నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. దశల వారిగా భూ సర్వే నిర్వహించి భూధార్ ను ఇస్తామని, రాష్ట్రం లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేలిపారు.

అవినీతికి పాల్పడితే ఎవరిని ఉపేక్షించబోము:

ధరణి పోర్టల్ లోని లోసగులను ఆసరాగా చేసుకొని కొంత మంది మీ-సేవ నిర్వాహకులతో కలిసి 3.99 కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేశారని, దీనిపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించామని తెలిపారు. తప్పుచేసిన వారి నుంచి ఆ సొమ్మును రికవరీ చేస్తామని ప్రకటించారు. ఇందులో అధికారుల పాత్ర ఉంటే ఏ స్థాయిలో ఉన్నా కూడా ఉపేక్షించబోమని తెలిపారు. శాసన మండలిలో సభ్యులు తాతా మధుసుదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి గారు సమాధానం ఇచ్చారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.

## జీవన్‌రెడ్డితో ఫలించని పిసిసి చీఫ్ దౌత్యం

మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పీసీసీ చీఫ్ పదవి రాకున్నా.. పార్టీ అధికారంలోకి వచ్చినందుకు సంతోషపడ్డా నన్నారు. మంగళవారం జగిత్యాలలోని తన నివాసానికి పార్టీ అధిష్ఠానం పంపిన దూతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో తనది పూలబాట కాదని.. ముళ్ల బాట అని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ కాబట్టి రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి, సీఎల్పీ లీడర్ కాబట్టి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారన్నారు. కానీ తాను శాసన మండలిలో నేతను అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేశారు. మరి తనకెందుకు అన్యాయం చేశారంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను ఈ సందర్భంగా జీవన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల్లో మనకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదర్శం కాదు కదా? అంటూ కాంగ్రెస్ నేతలకు ఆయన చరకలంటించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలు ఏమిటి? మనం చేస్తున్నదేమిటంటూ రాష్ట్రంలోని పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా నిలదీశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వంటి నేతలు ఇచ్చిన హామీ అమలు కాకపోతే పార్టీ ఎందుకంటూ జీవన్ రెడ్డి ఈ సందర్భంగా కొంత అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని చెప్పారు. తాను పార్టీ వీడి వెళ్తున్నానని తెలిసి.. అలా వచ్చి వెళ్లారంటూ కాంగ్రెస్ ప్రతినిధుల రాకపై జీవన్ రెడ్డి స్పందించారు.కాంగ్రెస్ పార్టీని వీడొద్దని మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని కోరామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్‌రెడ్డితో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సాకేవత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర, 43 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడు జీవన్‌రెడ్డి. ఆయన మాకు తండ్రిలాంటివారు. రాజకీయాల్లో ఆయన సీనియర్ నేత. జీవన్‌రెడ్డిని కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను వదలుకోదలచుకోలేదు. పార్టీ వీడే అంశంలో పునరాలోచన చేయాలని కోరాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేష్ భేటీ ముగిసింది. పార్టీలో కొనసాగండి, పార్టీని వీడకండి. భవిష్యత్తుపై చర్చిద్దామని పీసీసీ చర్చలు జరిపారు. ఏఐసీసీ నాయకులు సైతం పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరారు. భేటీ అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడారు. 'జీవన్ రెడ్డి మా తండ్రి సమానులు. 43 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. రాష్ట్రంలో అంతకన్నా సీనియర్ నాయకులు లేరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వయసులోనూ ఇబ్బంది పడ్డారు. కొన్ని సార్లు రాజకీయంలో అనుకోని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. జీవన్‌రెడ్డి ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి నా సూచనల మేరకు మంత్రి శ్రీధర్ బాబు వచ్చారు. నేను కూడా ఈ రోజుల కలిశాను. కాంగ్రెస్‌తో అనుబంధాన్ని తెంచొద్దని, మమ్మల్ని వీడొద్దని వారికి విన్నవించడం జరిగింది. కార్యకర్తల ఒత్తిడి తదితర కారణాల వల్ల వారు ఈ నిర్ణయం తీసుకుంది. వారు పార్టీలోనే ఉండాలని ఏఐసీసీ పట్టుబడుతోంది. నాకు జీవన్‌రెడ్డితో 1986 నుంచి పరిచయం. అప్పటి నుంచి మాకు రాజకీయంగా సలహాలు ఇచ్చారని తెలిపారు. జీవన్ రెడ్డి రాజీనామా చేయరు అనే ఆశతో ఇక్కడి నుంచి వెళు_న్నామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు.అయితే వారు ఎలాంటి హామీ ఇవ్వలేక పోయారు. దీంతో ఆయనకు సూచనలు చేసి వెనుదిరిగారు. పార్టీ మారడామా లేదా అన్నది కూడా తన చేతిలో లేదని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖయానించారు. ఇప్పటికే శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌లు ఓమారు జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఇక ఈ భేటీ అంనంతరం ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ చర్చలు ఫలించలేదు. జీవన్‌రెడ్డి ఇంటిపై ఉన్న కాంగ్రెస్ ప్లేక్సీని అభిమానులు తొలగించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది పరిష్కారం లేని సమస్యగా మారింది.. సమస్యకు పరిష్కారం నా దగ్గర లేదు.. వారి దగ్గర కూడా లేదు. రేపు 10 గంటలకు కార్యకర్తలు అందరు భేటీ అవ్వండి. గార్డెన్‌కి రండి.. రేపు భవిష్యత్తు, పయనం ఎలా ఉంటుందో తెలియదు.. కాంగ్రెస్ పార్టీలో ఉండి స్వపక్షంతో యుద్ధం నేను చేయలేను. నేను నా నిర్ణయం రేపు ప్రకటించబోతున్న.. నా నిర్ణయం దైవ నిర్ణయంగా భావిస్తున్నా.‘ అని జీవన్‌రెడ్డి తెలిపారు. ఇక కాంగ్రెస్‌కు రేపు జీవన్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# పునర్విభజనతో మరిన్ని అవకాశాలు



ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజక వర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంలో ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా, వాస్తవిక దృక్పథంతో ప్రజాప్రతినిధులు ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. 2009లో చివరిసారిగా పునర్విభజన జరిగినప్పుడు రాష్ట్రం, దేశంలో చోటు చేసుకున్న అంశాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవా లన్నారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రజాప్రయోజనమే పరమార్థంగా, సహేతుకంగా పునర్విభజన జరిగేలా జనసేన ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా జనసేన ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువలో (రీచ్ అవుట్) ఉంటూ... నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో మంగళవారం విజయవాడలో సమావేశమయ్యారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియోజక వర్గాల పునర్విభజన నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలను 50 శాతం పెంచాలన్న కేంద్రం నిర్ణయం హర్షణీయం. కేంద్రం నిర్ణయంతో 88 అసెంబ్లీ సీట్లు, 12 వరకు పార్లమెంట్ సీట్లు కొత్తగా పెరుగుతాయి. అంటే కొత్తగా 100 మంది ప్రతినిధులను చట్ట సభలకు పంపించే అవకాశం వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకొని డీలిమిటేషన్ ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మనపై ఉంది. డీలిమిటేషన్ పై జనసేన ఏ విధంగా ముందుకు వెళ్లాలి? ఎటువంటి కార్యాచరణ అవలంబించాలి? అనే అంశాలపై సూచనలు చేయడానికి శాసనసభ్యులతో కూడిన కమిటీ నియమించాలని పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారికి సూచిస్తున్నాను. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలిమిటేషన్ పై పార్టీ కార్యాచరణ నిర్దేశిరచుకుందాం. కొద్ది నెలల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్నాయి. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలి. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. ఏ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా కష్టపడాలి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభిలషణీయమైన సంఖ్యలో గెలుపొందడం మన శ్రేణుల పోరాట పటిమకు నిదర్శనం. వచ్చే స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా సిద్ధంగా ఉండాలి. పార్టీ బలంగా ఉంటేనే ప్రజా ప్రతినిధులు బలంగా ఉంటారు. దానిని దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి ప్రజా ప్రతినిధులు ముందుండి పని చేయాలి. ఉద్యమి సభ్యత్వం ఎంత అధికంగా ఉంటే పార్టీ అంత బలంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వివిధ వర్గాలు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలను ఏ విధంగా కలిసి ఓట్లను అభ్యర్థించామో... అదే విధంగా, అదే రీతిలో ఇప్పుడు కూడా నిరంతరం వారిని కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కొన్ని అసాధ్యమైన కోరికలు వ్యక్తమైనప్పటికీ సాధ్యాసాధ్యాలను వారి ముందు ఉంచితే వారి మనసులు గెలుచుకోవడం కష్టం కాదు. వారంలో ఏదో ఒక రోజు నియోజకవర్గంలో ఒక ప్రాంతంలో ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. దీని కోసం పక్కాగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి. నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో దృష్టి పెట్టాలి. వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలపై దృష్టి సారించి అన్ని వర్గాల ప్రజలకు దగ్గరవ్వాలి. కులాలు లేకుండా సమాజం నడవదు. ప్రతి కులాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలి. ప్రతి శాసనసభ్యుడు రాజకీయ వాస్తవికతకు దగ్గరగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి. ÷ూష్ట్రంలో 8-12 శాతం వరకు యువత ఉన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మావన వనరులుగా వారిని తీర్చిదిద్దాలి. జెన్ జి ఆలోచనలు అర్థం చేసుకోవాలి. వారిని చేరువ అవ్వడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి. రాజకీయ కార్యకలాపాలకు కుటుంబ సభ్యులను ఎంత పరిమితి మేరకు అనుమతించాలో ప్రజాప్రతినిధులు ఎవరికి వారు లోతుగా ఆలోచన జరిపి నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం ప్రజలు హర్షించేలా ఉండాలి. వ్యక్తులు చేసిన పనులు వ్యక్తులకే పరిమితం అవ్వాలి. అంతే తప్ప వాటి ఆధారంగా పార్టీపై ప్రభావం పడకూడదు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా నిధులు సమకూర్చాము. వాటి సద్వినియోగంపై అందరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవి క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ కావాలి. జల్ జీవన్ మిషన్ 2 .0 కి ఈ రోజు ఎం.ఓ.యూ. చేసుకున్నాము. జల్ జీవన్ నిధులతో ప్రతి ఇంటికీ తాగు నీరు ఇచ్చే లక్ష్యంతో పని చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గానికి పీఆర్ ఆర్డీ శాఖలు, ఆర్. డబ్ల్యు.ఎస్. ద్వారా నిధులు అందుతున్నాయి. వాటి ద్వారా చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉంది' అన్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'సంఖ్యాపరంగా అసెంబ్లీలో జనసేన పార్టీ రెండో స్థానంలో ఉండటం మనందరికీ గర్వ కారణం. స్థానిక సంస్థల ఎన్నికలకు స్థానికంగానే వ్యూహరచన చేసుకోవాలి. డీలిమిటేషన్ లో చేర్పులు, మార్పులు, విభజన పక్రియలు జిల్లా యంత్రాంగం చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. గతంలో జరిగిన డీలిమిటేషన్ పక్రియ ఆధారంగా ఈ మాటలు చెబుతున్నాను. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి చోట గెలిచి నూటికి నూరు శాతం ఫలితాలు రాబట్టుకోవాలి అని కోరారు. లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. 3 గంటల సేపు కొనసాగిన ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆ తరువాత గ్రూపులుగా, విడివిడిగా అందరి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చిన క్రమంలో ముఖ్యమైన అంశాల మీద అధ్యయనానికి పార్టీకి, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రజాప్రతినిధులతో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి సూచించారు. చర్చించిన అంశాలు ప్రజలు, పార్టీకి ఉపయోగపడేలా మలుచుకోవాలని సూచించారు. ప్రతి నెల 3 లేదా 4వ వారంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అందరితో సమావేశమవుతానని చెప్పారు. వచ్చే నెల తొలి వారంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈ సమావేశంలో రాజకీయంగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పారు.

## పీఐబీ, సీబీసీ హైదరాబాద్ ఏడీజీతో సమావేశమైన పీఐబీ భువనేశ్వర్ నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం

**- నాలుగు రోజుల మీడియా పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకున్న పీఐబీ భువనేశ్వర్ నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం**



**హైదరాబాద్ పిఐబి వెలుతురు 24 మార్చి 2026:**
హైదరాబాద్ అధికారిక మీడియా పర్యటనలో భాగంగా భువనేశ్వర్‌లోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నేతృత్వంలోని మీడియా ప్రతినిధి బృందం.. హైదరాబాద్‌లోని పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) శ్రీమతి శ్రు తి పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో భాగస్వామ్య వ్యూహాలకు ఉన్న ప్రాముఖ్యతను శ్రీమతి శ్రుతి పాటిల్ చెప్పారు. 2026 మార్చి 24 నుంచి మార్చి 27 వరకు జరగనున్న ఈ నాలుగు రోజుల మీడియా పర్యటనలో భువనేశ్వర్ నుంచి వచ్చిన 11 మంది సభ్యుల బృందం పాల్గొంటుంది. కేంద్ర ప్రభుత్వ కీలక కార్యక్రమాల గురించి పాత్రికేయులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు హైదరాబాద్‌లోని సాంస్కృతిక వైభవం, వారసత్వం, మౌలిక సదుపాయాల వృద్ధిని తెలియజేసే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్‌లోని ఎన్ఐఈపీడీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్), విద్యానగర్‌లోని ఎన్ఎస్‌టీఐ (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) వంటి ప్రతిష్టాత్మక సంస్థల సందర్శనలు కూడా ఉన్నాయి. ఇవి సామర్థ్య పెంపు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సాధికారత కార్యక్రమాలపై లోతైన అవగాహనను కల్పిస్తాయి.

## హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**- అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం కానున్న కమిటీ.**



**హైదరాబాద్, వెలుతురు మార్చి 24:**
హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో మంగళవారం రోజున రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచారపౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో–చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచారపౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి అభివృద్ధికి ప్రణాళికలు

- **రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు**
- **మేడ్చల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి**
- **అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:**
బిఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు.



జిహెచ్‌ఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామని, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎస్ఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా మీకు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి' అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివృద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తుచేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.

# ప్రపంచ శాంతికి కాపలాదారా? లేక యుద్ధాల సూత్రధారా?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*ఇరవై ఒకటో శతాబ్దపు ప్రపంచ రాజకీయ పటాన్ని గమనిస్తే, ఒక దేశం పేరు వినబడకుండా ఏ రోజూ గడవదు. అది అమెరికా. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కులు. ఈ పదాలను ప్రపంచవ్యాప్తంగా వల్లించే అమెరికా, అదే సమయంలో అత్యధిక యుద్ధాల్లో పాల్గొంటున్న దేశంగా కూడా నిలుస్తోంది. ఒకవైపు శాంతి దూతగా తనను తాను ప్రకటించుకుంటూనే, మరోవైపు అత్యాధునిక క్షిపణులు, యుద్ధ విమానాలతో ఇతర దేశాల సరిహద్దుల్లో ఎందుకు కనిపిస్తుంది? ఈ వైరుధ్యమే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేధావులను, సామాన్య పౌరులను ఆలోచింపజేస్తోంది. అమెరికా ఎంచుకుంటున్నది శాంతి మార్గమా లేక సామ్రాజ్యవాద వ్యూహమా?*

**యుద్ధాల సుదీర్ఘ నీడ: చారిత్రక నేపథ్యం:**

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, ప్రపంచం ఒక కొత్త రకమైన ఆధిపత్య పోరును చూసింది. అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శించని దశాబ్దమే లేదని చెప్పవచ్చు. 1950ల నాటి కొరియా యుద్ధం నుండి మొదలుకొని, వియత్నాం అడవుల్లో కురిసిన నాపామ్ బాంబుల వరకు, ఇరాక్ ఎడారుల్లో జరిగిన 'ఆపరేషన్ డెజర్ట్ స్టార్మ్' నుండి మొన్నటి ఆఫ్ఘనిస్తాన్ నిష్క్రమణ వరకు అమెరికా సైనిక చరిత్ర రక్తసిక్తమైంది. గత అర్ధ శతాబ్ద కాలంలో సుమారు 30కి పైగా దేశాల్లో అమెరికా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జోక్యం చేసుకుంది. పనామా, గ్రెనడా వంటి చిన్న దేశాలైనా, సిరియా, లిబియా, యెమెన్ వంటి సంక్లిష్ట ప్రాంతాలైనా అమెరికా తుపాకీ గొట్టం అక్కడ వినిపిస్తూనే ఉంది. ఇది కేవలం భద్రత కోసమేనా లేక ప్రపంచాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలనే తాపత్రయమా? ప్రతి చిన్న సమస్యకూ యుద్ధమే పరిష్కారమని భావించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి?

**భద్రత ముసుగులో.. అమెరికా వాదనలు:**

అమెరికా తన సైనిక చర్యలను సమర్థించుకోవడానికి ప్రధానంగా మూడు సూత్రాలను వాడుతుంది జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యాప్తి, మరియు మానవ హక్కుల రక్షణ. మేము అక్కడ యుద్ధం చేయకపోతే, ఆ తీవ్రవాదం మా వాకిట్లోకి వస్తుంది అనేది వారి ప్రధాన వాదన. వేల మైళ్ల దూరంలో ఉన్న దేశాలపై బాంబులు వేయడం తమ ఆత్మరక్షణలో భాగమని వారు నమ్ముతారు. మరోవైపు, నిరంకుశ పాలకుల నుండి ప్రజలకు విముక్తి కలిగిస్తామని, వారికి ఓటు హక్కు, స్వేచ్ఛను ప్రసాదిస్తామని అమెరికా చెబుతుంది. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను గద్దె దించినా, ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని ప్రయత్నించినా ఈ ఉదాత్తమైన ఆశయమే కనిపిస్తుంది. కానీ, క్షేత్రస్థాయిలో ఆ స్వేచ్ఛ ఏమైంది? బాంబుల మోత మధ్య పుట్టిన ప్రజాస్వామ్యం ఎంతకాలం నిలబడుతుంది?

**లాభాల వేట: సైనిక-పారిశ్రామిక సముదాయం:**

విమర్శకుల దృష్టిలో అమెరికా యుద్ధాల వెనుక ఉన్న అసలు సూత్రధారి డబ్బు . అమెరికా ఆర్థిక వ్యవస్థలో రక్షణ రంగం ఒక భారీ యంత్రం. లాకీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి సంస్థలు యుద్ధం జరిగితేనే బిలియన్ల డాలర్ల లాభాలను గడిస్తాయి. యుద్ధం అనేది వీరికి ఒక వ్యాపారం. ఈ సంస్థలు రాజకీయ పార్టీలకు భారీగా నిధులు సమకూరుస్తాయి, తద్వారా ప్రభుత్వం యుద్ధం వైపు మొగ్గు చూపేలా లాబీయింగ్ చేస్తాయి. దీన్నే మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ అంటారు. అంటే, ఆయుధాలు అమ్ముడుపోవాలంటే ఎక్కడో ఒకచోట మంటలు మండుతూనే ఉండాలి. దీనికి తోడు చమురు రాజకీయాలు మరొక కోణం. మధ్య ప్రాచ్య దేశాల్లో అమెరికా జోక్యం వెనుక ప్రజాస్వామ్యం కంటే పెట్రోల్ నిల్వలపై నియంత్రణే ప్రధానమని విశ్లేషకులు భావిస్తారు. ఇరాక్ దగ్గర



సామూహిక విధ్వంసక ఆయుధాలు (ఔవీణం) ఉన్నాయని చెప్పి దాడి చేశారు, కానీ అక్కడ ఒక్క ఆయుధమూ దొరకలేదు. దొరికిందల్లా చమురు బావుల పై ఆధిపత్యం మాత్రమే.

**మానవత్వానికి తగిలిన గాయం: లెక్కలేనన్ని శవాలు:**

గణాంకాలు ఎప్పుడూ నిజం చెబుతాయి, కానీ అవి గుండెలను పిండేస్తాయి. కేవలం ఇరాక్ యుద్ధంలోనే లక్షలాది మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వియత్నాంలో ఆ సంఖ్య 30 లక్షలు దాటింది. యుద్ధం అంటే కేవలం సైనికులు చనిపోవడం కాదు,తల్లులు బిడ్డలను కోల్పోవడం, పిల్లలు అనాథలవ్వడం, తరతరాలుగా నిర్మించుకున్న సంస్కృతి శిథిలమవ్వడం. యుద్ధం ముగిసినా ఆ గాయాలు మానవు. క్లస్టర్ బాంబుల వల్ల, రసాయన ఆయుధాల వల్ల పుట్టే బిడ్డలు వైకల్యంతో జన్మించడం చూస్తుంటే, అమెరికా చెప్పే మానవత్వం ఎక్కడుందని ప్రశ్నించక తప్పదు. అలాగే, యుద్ధానికి వెళ్లిన అమెరికా సైనికులు కూడా బాధితులే. శారీరక గాయాల కంటే మానసిక గాయాలతో (ఘూణ) తిరిగి వచ్చే వేలాది మంది సైనికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యుద్ధం ఎవరికీ శాంతిని ఇవ్వదు, కేవలం శ్మశానాలను మాత్రమే మిగులుస్తుంది.

**శాంతి మార్గాలు ఎందుకు కనుమరుగవుతున్నాయి?**

ఐక్యరాజ్యసమితి (ఖచీ) వంటి సంస్థలు ఉన్నప్పటికీ, అమెరికా తరచుగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుంది. దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్నా, సైనిక బలాన్ని ప్రదర్శించడమే సులభమని భావిస్తుంది. దీనికి ప్రధాన కారణం అహంకారం మరియు త్వరిత ఫలితాల మీద ఆశ. చర్చలు జరపడం అంటే బలహీనతగా అమెరికా నాయకత్వం భావిస్తుంది. కానీ చరిత్ర ఏం చెబుతోంది? ఇరాక్‌లో గందరగోళం మిగిలింది, ఆఫ్ఘనిస్తాన్‌లో 20 ఏళ్ల తర్వాత మళ్లీ తాలిబాన్లే అధికారంలోకి వచ్చారు. అంటే ట్రిలియన్ల డాలర్ల ఖర్చు, వేల మంది ప్రాణాలు బూడిదలో పోసిన పన్నీరయ్యాయి.

భవిష్యత్తు వైపు:

**యుద్ధానికి స్వస్తి చెప్పగలమా?**

అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారతదేశం వంటివి ఎప్పుడూ వసుధైక కుటుంబకం అనే సిద్ధాంతాన్ని నమ్ముతాయి. యుద్ధం అనేది చివరి మార్గం కావాలి, మొదటి ఎంపిక కాదు. అమెరికా తనకున్న అపారమైన సంపదను, సాంకేతికతను యుద్ధం కోసం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా పేదరికం నిర్మూలనకు, విద్యకు, వాతావరణ మార్పుల (జశ్రీఐఎఫ్వ జష్ఖుఅస్త్రవ) పోరాటానికి వాడితే ఎంత బాగుంటుంది?అమెరికా లోపల కూడా ఇప్పుడు మార్పు మొదలైంది. యువ తరం తమ పన్నుల డబ్బు యుద్ధాలకు వెచ్చించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తోంది. యుద్ధాల వల్ల అమెరికా ప్రతిష్ట దిగజారుతోందని, తమ దేశం ప్రపంచ పోలీసు పాత్రను వదిలి ప్రపంచ భాగస్వామి గా మారాలని వారు కోరుకుంటున్నారు.యుద్ధం అనేది ఒక విషవలయం. అది ఒక సమస్యను పరిష్కరిస్తూ పది కొత్త సమస్యలను సృష్టిస్తుంది. అమెరికా తన విదేశాంగ విధానాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధిపత్యం కంటే ఆత్మీయత, బాంబుల కంటే చర్చలు గొప్పవని గుర్తించాలి.మనం మన భావి తరాలకు ఏం ఇస్తున్నాం? తుపాకులు ఉన్న ప్రపంచాన్నా లేక పుస్తకాలు ఉన్న ప్రపంచాన్నా? ఈ ఎంపిక అమెరికా చేతుల్లో మాత్రమే కాదు, అంతర్జాతీయ సమాజం ఒత్తిడిపై కూడా ఆధారపడి ఉంటుంది. మానవత్వం గెలవాలంటే యుద్ధం ఓడిపోవాలి. శాంతి అనేది కేవలం యుద్ధం లేకపోవడం కాదు, అది అందరూ కలిసి జీవించే ఒక గొప్ప సంస్కృతి. ఆ దిశగా ప్రపంచ అగ్రరాజ్యం అడుగులు వేస్తుందని ఆశిద్దాం.

## 25న హైదరాబాద్ వేదికగా న్యాకో సురక్ష సంకల్ప్ కార్యశాల

**హైదరాబాద్ వెలుతురు 24 మార్చ్, 2026:**
జిల్లాస్థాయిలో హెచ్ఐవీ నియంత్రణ చర్యలు చేపడుతున్న న్యాకో జాతీయ హెచ్ఐవీ నియంత్రణ చర్యలలో భాగంగా జిల్లా స్థాయి కార్యాచరణను వేగవంతం చేసేందుకు భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(న్యాకో) రాష్ట్రాలతో మరింత అనుసంధానమై పని చేస్తోంది. ఇందులో భాగంగా 'సురక్ష సంకల్ప్ కార్యశాల' పేరుతో మార్చి 25న హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి న్యాకో అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షత వహిస్తారు. "మిషన్ ఎయిడ్స్ సురక్ష" అనే విస్తృత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యశాల జరుగుతోంది. సురక్ష సంకల్ప్ కార్యశాలల ద్వారా హెచ్ఐవీ ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో కార్యక్రమ అమలును బలోపేతానికి న్యాకో రాష్ట్రాలతో కలిసి పనిచేస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమ నిర్వాహకులను, ప్రధాన భాగస్వాములను ఈ కార్యశాల ఏకతాటిపైకి చేర్చుతుంది. ఇందులో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ, జిల్లా

NACO
National AIDS Control Organisation
India's response to HIV & Sexually Transmitted Infections
Ministry of Health & Family Welfare, Government of India
www.naco.gov.in

కలెక్టర్లు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యారోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పాల్గొంటారు. తెలంగాణలో హెచ్ఐవీ ప్రాబల్యం 0.41 శాతంగా ఉండటం, హెచ్ఐవి/ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారి సంఖ్య 1,56,961 ఉన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టితో కూడిన ఈ విధానం కింద ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా గుర్తించారు. కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, సిద్దిపేట, మెదక్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, సూర్యాపేట, పెద్దపల్లి, జనగాం, వికారాబాద్, కామారెడ్డి, హనుమకొండ, సంగారెడ్డి, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి సహా 19 ప్రాధాన్యత జిల్లాలను గుర్తించారు. ఈ జిల్లాల ప్రతినిధులు కార్యశాలలో పాల్గొని తమ జిల్లాల పురోగతిని వివరిస్తారు. కార్యక్రమ అమలులో సవాళ్లపై చర్చిస్తారు. సేవలను మరింత మెరుగ్గా అందజేసేందుకు లక్షిత వ్యూహాలను రూపొందిస్తారు. హెచ్ఐవీ నివారణతో పాటు, నిర్ధారణకు పరీక్షా సేవలను మరింత మెరుగ్గా అందుబాటులోకి తేవడం, చికిత్సతో అనుసంధానం, చికిత్స కొనసాగేలా చూడటం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడంపై ప్రధాన దృష్టితో ఈ కార్యశాలలో చర్చలు జరుగుతాయి. జాతీయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయ చర్యలను చేపట్టడం ద్వారా ఈ కార్యశాలలు కార్యక్రమ అమలులో డేటా–ఆధారిత, వికేంద్రీకృత విధానాన్ని బలోపేతం చేస్తున్నాయి. ఈ కార్యక్రమం జాతీయ హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల దిశగా పురోగతిని గణనీయంగా వేగవంతం చేస్తుందని, ప్రజారోగ్యానికి ముప్పుగా ఉన్న ఎయిడ్స్‌ను అంతం చేయాలనే భారతదేశ నిబద్ధతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

## నేటి డిజిటల్ యుగంలోనూ వార్తల ప్రసారంలో ఆకాశవాణి పాత్ర సుస్థిరం

**- ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్**

**వెలుతురు 24 మార్చి, హైదరాబాద్:**
డిజిటల్ యుగంలోనూ ఆకాశవాణి వార్తలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ శ్రీ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతోపాటు సోషల్ మీడియాలోనూ ఆకాశవాణి ప్రత్యేకత చాటుకుంటుందన్నారు. హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో కవాడీగూడ సీజీవో టవర్స్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పార్ట్‌టైమ్ కరస్పాండెంట్లు, క్యాజువల్ న్యూస్ ఎడిటర్లు, న్యూస్ రీడర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్. మహేశ్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వృత్తి మెలకువలను పెంపొందిస్తోందన్నారు. సోషల్ మీడియా ఒత్తిడి నేపథ్యంలో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ.. విశ్వసనీయతను కాపాడుకుంటూ, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.



తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత వల్ల వార్తకు నిర్వచనం మారిపోయిందన్నారు. ప్రభుత్వ సంస్థగా ఆకాశవాణిలో కచ్చితత్వాన్నీ, ధర్మనిష్టనూ పాటించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పీఐబీ, హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. వాట్సాప్ ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోవిడ్–19 విపత్తు సమయంలో పీఐబీ ప్రారంభించిన 'ఫ్యాక్ట్ చెక్' విభాగం గురించి ఆమె వివరించారు. ప్రభుత్వ సమాచార వారధులుగా.. క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై విలేకరులు దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ.. విశ్వసనీయతకూ, సమగ్రతకూ, సంపూర్ణతకూ ఆకాశవాణి మారుపేరని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటూ.. విశ్వసనీయతను కాపాడుకుంటూ ఆకాశవాణి ఖ్యాతిని నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి, హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్. మహేశ్ మాట్లాడుతూ.. 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణి వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉర్దూ శ్రోతలను దృష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ మొదలైందని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖుల ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. 'మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ రూపకల్పన' అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్. దిలీప్ రెడ్డి ప్రసంగించారు. 'సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం' అంశంపై ది హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ డాక్టర్ కూర్మనాథ్ అవగాహన కల్పించారు. 'న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ ప్రసారం, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం' అంశంపై ఐ న్యూస్ సీఈవో, చీఫ్ ఎడిటర్ ఎ.కె. సాగర్ విశ్లేషించారు. అలాగే, 'ఫాక్ట్ చెక్, సోషల్ మీడియా హాండిళ్లను మెరుగుపరిచేందుకు సోషల్ మీడియా పద్ధతులు' అంశంపై ఫాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ మాట్లాడారు. మారుతున్న మీడియా పరిస్థితులలో ఆకాశవాణి విలేకరులకు ఈ శిక్షణ కార్యక్రమం సరికొత్తగా దిశానిర్దేశం చేసింది.

# సంపాదకీయం..

# సీట్లు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే !



రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్ధం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నలనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి ప్ఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది.

816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37-38కి, అసెంబ్లీ సీట్లు 262-263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది.

ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్టాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి.

నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

## కొనసాగనున్న ఆర్డీటి సేవలు

- కేంద్రం అనుమతితో యథావిధిగా కార్యక్రమాలు



**అమరావతి,మార్చి24( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ కార్యకలాపాలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఆర్డీటీ సేవలు ఆగిపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఆర్డీటీకి అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. దీంతో సంస్థకు ఎదురైన పరిపాలనా అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్డీటీ డైరెక్టర్ మంచో ఫెర్రర్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా దశాబ్దాలుగా తెలుగు రాష్టాల్లో అందుతున్న సేవలు వెలకట్టలేనివి. అనంతపురం జిల్లాతో పాటు యావత్ రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఈఅఖీం పునరుద్ధరణ లభించడం ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అనంతపురం జిల్లా సామాజిక, ఆర్థిక చిత్రపటాన్ని మార్చేసిన ఆర్డీటీ సంస్థకు ఉన్న అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. విదేశీ నిధుల సేకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం మార్చి 22, 2031 వరకు పొడిగిస్తూ అధికారికంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాయలసీమతో పాటూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆర్డీటీ ఎంత అవసరమో వివరించారు. నిలిచిపోతాయనుకున్న అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో కొనసాగనున్నాయి. ఈ లైసెన్స్ పునరుద్ధరణ వెనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కృషి అనితరసాధ్యమైనది. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ఢిల్లీకి వెళ్లి, కేంద్ర హోం శాఖాధికారులు, మంత్రులతో భేటీ అయ్యారు. ఆర్డీటీ దశాబ్దాలుగా చేస్తున్న నిరుపమాన సేవలను వారికి వివరించి, సాంకేతిక ఇబ్బందులను తొలగించేలా ఒప్పించారు.

## అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు

- కుట్రకోణంపై దర్యాప్తు: హోంమంత్రి



**అమరావతి, మార్చి24(వెలుతురు):**

రాజధాని అమరావతిపై ఎవరు కుట్రలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. అమరావతిలో వరుసగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం.. అది కూడా ఒకే తరహాలో జరుగుతుండటంపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడుతూ.. అమరావతిలోని రాయపూడి సమీపంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల బంగ్లాల వద్ద గత అర్ధరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదాన్ని.. ఐదు అగ్నిమాపక శకటాలతో చాలా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అమరావతిలో ఇటీవల జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించారన్నారు. ఆ రోజు సైతం జరిగిన అగ్నిప్రమాదం కూడా ఉద్దేశపూర్వకంగా జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అమరావతి ప్రాంతంలో గత కొద్ది రోజులుగా వర్షం కురిసినందున ఈ తరహా ఘటనలు జరగటానికి అవకాశాలు చాలా స్వల్పమని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ÷రిళిమవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ ఘనంగా జరిగిందని.. దీన్ని చూసి ఓర్వలేక రాజధానిలో పైపులకు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయని మంత్రి అనిత సందేహం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఓర్వలేక అరటితోటకు నిప్పు పెట్టిన ఉదాహరణలు ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఈ ప్రమాదంపై పోలీసు శాఖ అన్ని కోణాల్లో విచారణ చేస్తోందని మంత్రి అనిత వివరించారు.

## “సమానత్వానికి విద్య పునాది బలహీన వర్గాలపై గరికపాటి మాటల ప్రభావం”



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

భారతదేశం వంటి విభిన్నతల సమాజంలో “విద్య” అనేది కేవలం చదువు కాదు, అది సామాజిక న్యాయం, సమానత్వం, స్వాభిమానం, అవకాశాల సమాన పంపిణీకి పునాది. అటువంటి విద్యా వ్యవస్థపై ఎవరైనా బాధ్యతారహితంగా మాట్లాడినప్పుడు, అది కేవలం ఒక అభిప్రాయం కాదు, అది సమాజంలోని బలహీన వర్గాల భవిష్యత్తుపై పడే మోసం. “ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ఇవ్వకూడదు, పుస్తకాలు అవసరం లేదు, యూనిఫామ్ అవసరం లేదు ఎవడు చదువుకుంటాడో వాడు చదువుకుంటాడు” అనే గరికపాటి వంటి వ్యాఖ్యలు ఈ కోణంలో చూస్తే ప్రమాదకరంగా కనిపిస్తాయి. ఇలాంటి మాటలు వినడానికి కొందరికి “స్వీయ బాధ్యత” అనే గొప్ప సిద్ధాంతంలా అనిపించవచ్చు. కానీ భారతదేశంలోని సామాజిక వాస్తవాలు చూస్తే, ఇవి అసలు సమానత్వానికి విరుద్ధంగా, బడుగు, బలహీన, దళిత, గిరిజన, బహుజన వర్గాల పిల్లలను విద్య నుంచి దూరం చేసే ఒక పరోక్ష ఆహ్వానం. ఎందుకంటే, చదువు అందరికీ ఒకే స్థాయిలో అందుబాటులో లేదు. ఒకరి ఇంట్లో పుస్తకాలు, ట్యూషన్లు, పోషకాహారం, సౌకర్యాలు ఉంటే, మరొకరి ఇంట్లో రెండు పూటల భోజనం కూడా కష్టమే. అందుకే భారత రాజ్యాంగం విద్యను ఒక హక్కుగా గుర్తించింది. 2002లో జరిగిన 86వ రాజ్యాంగ సవరణ (86వ్త్ర ూఎవవఅఎవత్) ద్వారా ూతీఅఎశ్రీవ 21ూ చేరింది,2009లో =అస్త్రష్ట్ర ˉశీ జుఎబఎ్ఛఅశీఅ ూష్ (=ఱజు ూష్) ద్వారా అమలులోకి వచ్చింది. ఇక ఈ ఆర్టికల్ 21-ూ ప్రకారం ప్రతి పిల్లవాడికి ఉచిత, తప్పనిసరి విద్య హక్కు. అలాగే ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 15 వివక్షను నిషేధిస్తుంది. ఈ విలువలన్నింటినీ అమలు చేయడానికి ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఇవి దానం కాదు ఇవి హక్కులు. మధ్యాహ్న భోజనం గురించి మాట్లాడితే, అది కేవలం ఆకలి తీర్చడమే కాదు, అది పిల్లలను పాఠశాలకు ఆకర్షించే ఒక ముఖ్యమైన సాధనం. పేద కుటుంబాల్లో పిల్లలు పాఠశాలకు రావడానికి ఇదొక ప్రేరణ. అనేక అధ్యయనాలు చూపించాయి , మధ్యాహ్న భోజనం వల్ల హాజరు శాతం పెరిగింది, డ్రాప్‌అవుట్లు తగ్గాయి, బాల్య పోషకాహారం మెరుగుపడింది. అటువంటి పథకాన్ని “అవసరం లేదు” అని చెప్పడం అంటే పేద పిల్లల చదువును పరోక్షంగా నిరాకరించడం.

ఇదే విధంగా పుస్తకాలు, యూనిఫామ్‌లు కూడా చిన్న విషయాలుగా కనిపించవచ్చు. కానీ పేద పిల్లల కోసం అవి చదువు కొనసాగించడానికి కీలకమైన సాధనాలు. ఒక చిన్నారి పుస్తకం కొనలేక స్కూల్‌కు వెళ్లకుండా ఉండటం అనేది మన సమాజానికి సిగ్గుచేటు. అలాంటి పరిస్థితులను తొలగించడానికి ప్రభుత్వం చేసే ప్రయత్నాలను తక్కువ చేసి మాట్లాడటం, ఆ పిల్లల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది “ఎవడు చదువుకుంటాడో వాడు చదువుకుంటాడు” అనే వాదన నిజంగా సమాన అవకాశాల సమాజంలోనే పనిచేస్తుంది. కానీ భారతదేశం ఇంకా ఆ స్థాయికి రాలేదు. కులం, ఆర్థిక పరిస్థితి, భౌగోళిక పరిస్థితులు, ఇవన్నీ ఒక పిల్లవాడి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే, అసమానతలు మరింత పెరుగుతాయి.

ఈ వ్యాఖ్యల వెనుక మరో ప్రమాదకరమైన భావన కూడా కనిపిస్తుంది విద్యను క్రమంగా కార్పొరేట్లకు అప్పగించే ఆలోచన. ప్రభుత్వ పాఠశాలలను బలహీనపరచి, సంక్షేమ పథకాలను తగ్గించి, “ప్రైవేట్‌దే మంచి” అనే వాదనను పెంచడం అనేది చాలా కాలంగా జరుగుతున్న ప్రక్రియ. దీని ఫలితం ఏమిటి? పేదలకు విద్య దూరమవుతుంది, ధనవంతులకు మాత్రమే నాణ్యమైన విద్య అందుతుంది. ఇది సమాజాన్ని మరింత విభజిస్తుంది.

బహుజన మేధావులు, సామాజిక కార్యకర్తలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది కేవలం ఒక వ్యక్తి అభిప్రాయం కాదు; ఇది ఒక విధమైన సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ దృక్పథం పెరిగితే, ప్రభుత్వాలు కూడా సంక్షేమ పథకాలపై వెనుకడుగు వేయవచ్చు. అందుకే సమాజం అప్రమత్తంగా ఉండాలి.

ఇక్కడ స్వేచ్ఛ హక్కు గురించి కూడా మాట్లాడాలి. ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయం చెప్పే హక్కు ఉంది. కానీ ఆ హక్కు బాధ్యతతో కూడి ఉండాలి. ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపే అంశాలపై మాట్లాడేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. ఒక ప్రముఖ వ్యక్తి చెప్పిన మాటలు వేల మందిని ప్రభావితం చేస్తాయి. అందుకే అటువంటి వ్యక్తులు మరింత బాధ్యతగా మాట్లాడాలి.

గరికపాటి చేసిన వ్యాఖ్యలు విద్యార్థుల పట్ల ఒక చులకన భావాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను తక్కువగా చూడటం అనేది ఒక ప్రమాదకరమైన ధోరణి. అదే పిల్లలు రేపటి సమాజాన్ని నిర్మించబోతున్నారు. వారిని ప్రోత్సహించాల్సింది పోయి, వారి హక్కులను ప్రశ్నించడం అనేది సమాజానికి మేలు చేయదు.

ప్రభుత్వ విద్యను కించపరచడం ద్వారా ఎవరికి లాభం? ఇది కూడా ఒక ప్రశ్న. ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడితే, ప్రైవేట్ విద్యాసంస్థలు బలపడతాయి. ఇది ఒక మార్కెట్ దృక్పథం. కానీ విద్య ఒక వస్తువు కాదు, అది ఒక హక్కు. ఈ సత్యాన్ని మనం మరచిపోకూడదు.

అంతేకాదు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలు కేవలం విద్యకే కాకుండా ఆరోగ్యానికి కూడా సంబంధించినవి. పోషకాహారం లేని పిల్లలు సరిగా చదవలేరు. వారి మానసిక, శారీరక వికాసం దెబ్బతింటుంది. అందుకే ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోంది. వాటిని నిరాకరించడం అంటే పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పెట్టడం.

ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వ పాత్ర మరింత ముఖ్యమవుతుంది. ప్రజల సంక్షేమాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. ఎవరైనా ఆ బాధ్యతను ప్రశ్నించినప్పుడు, ప్రభుత్వం కూడా తన విధానాలను బలంగా సమర్థించాలి. అలాగే ప్రజలలో అవగాహన పెంచాలి.

సమాజంలో ఇప్పటికే ఉన్న అసమానతలను తగ్గించడానికి విద్య ఒక ప్రధాన ఆయుధం. దాన్ని బలహీనపరచే ప్రతి ప్రయత్నాన్ని ఖండించాలి. గరికపాటి వంటి వ్యాఖ్యలు ఈ దిశలో ఒక హెచ్చరికగా చూడాలి. మనం మౌనం వహిస్తే, ఇది ఒక పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉంది.

బహుజన వర్గాల పిల్లలు ఇప్పుడిప్పుడే చదువులో ముందుకు వస్తున్నారు. మొదటి తరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాఠశాలలకు వస్తున్నారు. ఈ సమయంలో ఇలాంటి



వ్యాఖ్యలు రావడం అనేది చాలా దురదృష్టకరం. ఇది వారి ఉత్సాహాన్ని తగ్గించే ప్రమాదం ఉంది.

అందుకే సమాజంలోని ప్రతి బాధ్యతగల వ్యక్తి ఈ అంశంపై స్పందించాలి. విద్యను ఒక హక్కుగా కాపాడాలి. ప్రభుత్వ పాఠశాలలను బలపరచాలి. సంక్షేమ పథకాలను మరింత విస్తరించాలి. ఇదే నిజమైన అభివృద్ధి మార్గం.

చివరిగా చెప్పాల్సిందేమిటంటే “ఎవడు చదువుకుంటాడో వాడు చదువుకుంటాడు” అనే మాట ఒక అసమాన సమాజంలో న్యాయం కాదు. సమాన అవకాశాలు కల్పించిన తర్వాత మాత్రమే ఆ మాటకు అర్థం ఉంటుంది. అప్పటి వరకు ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాల్సిందే.

విద్యను కాపాడటం అంటే కేవలం పాఠశాలలను కాపాడటం కాదు అది సమాజాన్ని కాపాడటం. గరికపాటి వంటి వ్యాఖ్యలు మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి మనం అప్రమత్తంగా ఉండాలి, సమానత్వాన్ని కాపాడాలి, ప్రతి పిల్లవాడి చదువు హక్కును రక్షించాలి. ఇదే నిజమైన ప్రజాస్వామ్యం, ఇదే రాజ్యాంగ ఆత్మ. ఇక గరికపాటి చేసిన వ్యాఖ్యలు, భారతదేశ సమాజం మొత్తం,

గరిక పాటి బలుపు మాటలను మేథావులు, రచయితలు, బహుజనుల అందరూ ఖండించాలి.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

# మధ్యాహ్న భోజనం బడిపిల్లల హక్కు

## ఇందిరా పార్క్ స్థలాన్ని ఆక్రమునకు ప్రయత్నం చేసిన వ్యక్తిపై, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి - ఎం దశరథ్

**- సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డిమాండ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**
ఇందిరా పార్కులో సుమారు వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించి కరాటే కోచింగ్ నిర్వహిస్తు, ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ముషీరాబాద్ జోన్ కమిటీ డిమాండ్ చేస్తుంది. నేడు సిపిఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులతో కలిసి సందర్శించడం జరిగింది. హైడ్రా ఏసిపి తిరుమల్ ఇన్స్పెక్టర్ నర్సింగ్ రావు, జిహెచ్ఎంసి యూబీడి డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు, సిపిఎం ప్రతినిధి బృందంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్ ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్ జోన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు పి విమల పాల్గొన్నారు. ఇందిరా పార్క్ స్థలంలో గత నెల రోజుల నుండి కరాటే శిక్షణ కేంద్రంలో షెడ్డు నిర్మాణం కోసం పనులు జరుగుతున్న జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోకపోవడం అంటే అక్రమ నిర్మాణదారునితో జిహెచ్ఎంసి అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ స్థలాన్ని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారేమో అనే అనుమానం కలుగుతుంది. ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తుల నిర్మాణానికి ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిపనుల నిధుల నుండి నిధులు కేటాయించడం సరైనది కాదు. ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ పార్కు స్థలాన్ని అప్పగించేలా వ్యవహరిస్తున్నారు. వెంటనే ఎమ్మెల్యే నిధుల నుండి ఇచ్చిన నిధులను రద్దు చేయాలని, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణానికి ప్రయత్నించిన ఆక్రమణదారుడు మరియు అతని సహకరించిన జిహెచ్ఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది.

## అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పదోన్నతితో కొత్త బాధ్యతలు మహ్మద్ అబ్దుల్ సలీమ్‌కు సన్మానం



**మేడ్చల్ వెలుతురు మార్చి 24:**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ సలీమ్ గారు పదోన్నతి పొంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమితులై, మహబూబ్‌నగర్ జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ కార్యాలయానికి బదిలీ అవుతున్న సందర్భంగా, ఈరోజు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరీ గారు వారికి శాలువా కప్పి సత్కరించి, శాఖకు అందించిన సేవలను అభినందించారు. అలాగే కార్యాలయ సిబ్బంది అందరూ కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీతారాముల శోభ యాత్ర ఘనంగా నిర్వహించాలి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు



**బషీర్ బాగ్ వెలుతురు 24 మార్చి :**
ఈ నెల 27న నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల శోభాయాత్ర ను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు కోరారు. బాగ్ అంబర్ పేట డివిజన్ మహంకాళి దేవాలయం వద్ద గుగ్గిళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవాలయ సభ్యులను భక్తులను కలిసి కరపత్రాలను పంపిణీ చేసి శోభయాత్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ.మధ్యాహ్నం మూడు గంటలకుఅంబర్ పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై కాచిగూడ వీరసవర్కర్ విగ్రహం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని,హిందూ బంధువులు, భక్తులు ప్రజలు యాత్రలో పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.కృష్ణగౌడ్, చుక్కజగన్,దత్తు ముదిరాజ్, జి.మల్లేష్,, ఎడెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ ఘటన చిన్నారి బాధితులు హెచ్ఆర్సిని ఆశ్రయించారు



**బషీర్ బాగ్ వెలుతురు 24 మార్చి :**
నాగర్ కర్నూల్ ,కుమ్మేరా జాతరలో కాంగ్రెస్ అగ్రకుల అహంకారుల దాడిలో మృతి చెందిన చిన్నారి తల్లితండ్రులను పోలీసులు వేధిస్తూ. భయబ్రాంతులకు గురిచేయడమే కాకుండా దర్యాప్తులో నిందితులపట్ల అనుకూలంగా వ్యవహరిస్తూ.. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసులపై రాష్ట్ర మానవహక్కుల కమిషన్ కు బాధితులు పిర్యాదు చేశారు.పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ...నిందితులకు అనుకూలంగా సాక్షం చెప్పి, కేసు ఉపసంవరించుకుంటే...డబ్బులిస్తామని, లేదంటే మీపై అక్రమ కెసులు పెట్టి జైల్ కు పంపుతామని నాగర్ కర్నూల్ పోలీసులు వేధిస్తున్నరని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసారు .అన్యాయంగా తన కూతురు మరణానికి కారణమైన వారికి శిక్షపడే విధంగా చర్యలు తీసుకొని,ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చటరిత్య చర్యలు తీసుకోవాలని కమిషన్ ను వేడుకున్నారు .ఈ కార్యక్రమంలో బాధిత తల్లిదండ్రులు బంధువులు అందరూ వారి తరపు అడ్వకేట్ చింతల శ్రీకాంత్ గారు, దీజ,ాజ,ాు జీూజ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, మంచాలలో బిఆర్ఎస్ పార్టీ నాయకుల ముందస్తు అరెస్ట్

**- అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

**- బిఆర్ఎస్వి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు జగదీశ్వర్**

**ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మొహమ్మద్ జానీపాషా**

**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 24:**






ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెం బ్లీ ముట్టడికి పిలుపుమేరకు ఇబ్రహీం పట్నం మంచాలలో ముందస్తుగా పోలీస్ అధికారులు ఆర్ ఎస్ నాయకుల నివాసంవద్దకు వెళ్లి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి వి భాగం అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ ని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసిపోలీస్ స్టేషన్ కు తరలించారు మంచాలలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహమ్మద్ జానీ పా షాను మంచాల పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు సందర్భంగా ఇబ్రహీం ప ట్నం నియోజకవర్గం విద్యార్థివిభాగం అధ్యక్షుడు నిట్టుజగదీశ్వర్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమి టీమాజీ డైరెక్టర్ మహమ్మద్ జానీపాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీఅసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కి27నెలలు గడుస్తున్నాఇచ్చిన హామీలను నెర వేర్చకుండా మరియు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యరం గంపట్ల విద్యార్థుల్లను మరియు ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ పట్ల యువతని నిరుద్యోగులని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది అనిఅన్నారు ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలసమయంలో ఇచ్చిన వాగ్దా నం ప్రకారం అన్నిహామీలు నెరవేర్చాలి అనిఅన్నారు విద్యార్థుల సమస్యలు వెంటనే ప రిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమం వేగవంతంచేస్తామని అని అన్నా రు ప్రశ్నించే గొంతులను అడ్డుకొని అక్రమ అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదు అని అన్నారు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు అనిఅన్నారు.

**- గరికపాటి పై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలి**

**- బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్)**





**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**
"మధ్యాహ్న భోజనంలో గుడ్డెట్టారా.. గాడిద గుడ్డెట్టారా.. అన్నం తినేవాడికి కోడిగుడ్డు పెట్టడం ఏంటండి? బుద్ధుందా లేదా? చదివితే చదువుకోమను.. లేకపోతే వెళ్లిపోమని చెప్పు వాడికి. కోడిగుడ్డు కోసం వస్తావా నువ్వు?"
అని బడిపిల్లలను అవమానిస్తూ గరికపాటి నరసింహారావు గారు చేసిన వ్యాఖ్యలను బాలల హక్కుల సంక్షేమ సంఘం(బి హెచ్ ఎస్ ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ తీవ్రంగా ఖండించారు. వారు చేసిన వ్యాఖ్యలు పిల్లలను అవమానించేవే కాకుండా అర్థరహితమైనవని అంతే కాకుండా పిల్లలల హక్కులకు విఘాతం కల్పించేవి అని వారన్నారు. పిల్లల హక్కులకు విఘాతం కల్పించేలా మాట్లాడిన గరికపాటిపై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదుచేయాలని వారు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం అనేది ఇప్పుడు అందరూ మాట్లాడుతున్నట్లు కేవలం పెదపిల్లల కోసమే ప్రవేశపెట్టలేదు. మేము చిన్నతనంలో 1960 లలో చదువుకునేప్పుడే మొక్కజొన్న రవ్వ ఉప్మా, పాలు మధ్యాహ్నం పెట్టేవారు. అప్పుడు పేద ధనిక వర్గాల పిల్లలందరం కలిసి తినే వాళ్ళం. అప్పుడు ప్రయివేట్ స్కూళ్లు లేవు. పిల్లల్లో పెద్ద వాళ్లే ఉప్మా తయారు చేసేవాళ్ళం. ఆ తర్వాత కాలంలో దేశంలో అక్షరాస్యత శాతం పెంచడానికి అందరికీ విద్య అందించాలంటే బడీడు పిల్లలు అందరినీ బడికి రప్పించడం కోసం, వారికి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో మొదటగా తమిళనాడు రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి అన్నదురై చొరవతో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టబడింది. సుప్రీం కోర్టుకూడా మధ్యాహ్న భోజనం అనేది పిల్లల హక్కు అని తెలిపింది. గరికపాటి వ్యాఖ్యలు సుప్రీం కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కూడా ఉన్నవి. విద్యా హక్కు చట్టం కూడా మధ్యాహ్న భోజనం పిల్లల హక్కు అని చెప్తుంది. మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు ఉండాలని తర్వాత కోడి గుడ్డును కూడా చేర్చడం జరిగింది. "గుడ్డా గాడిద గుడ్డా" అని వ్యంగ్యంగా గరికపాటి మాట్లాడి పెద్ద తప్పు చేశారు. కేవలం పిల్లలనే కాదు గ్రుడ్డు తినే వారందరినీ హేళన చేసేలా ఉన్నవి వారి మాటలు.
అంతే కాకుండా "పిల్లలకి భోజనాలు ఇచ్చి, పుస్తకాలు ఇచ్చి, యూనిఫారమ్ ఇచ్చి.. ఇన్ని ఇస్తే వాడు చదువుతాడా.. శోభనం పెళ్లికొడుకులా మంచమెక్కి కూర్చుంటాడు" అని వ్యాఖ్యానించడం పిల్లలను అవమానించడమే. సందర్భం లేకుండా బడిపిల్లలు అందరినీ "శోభనం పెళ్లి కొడుకులు" అనీ దుర్భాషలాడడం చైల్డ్ అబ్యూజింగ్ క్రిందికే వస్తుందని కనుక గరికపాటిపై సుమోటోగా ఫోక్సో కేసు కూడా నమోదు చేయాలని డిజీపి గారికి బాలల హక్కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేస్తుందని వారన్నారు. మధ్యాహ్న భోజనమే కాదు పిల్లలకు ఉదయం అల్పాహారం కూడా అందించాలని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలుచేస్తుంది. గతంలో కేసీఆర్ గారు కూడా కొన్ని నెలలు "సీఎం బ్రేక్ ఫాస్ట్" అని ఉదయం పూట రాష్ట్రవ్యాప్తంగా పెట్టారు. కానీ అది అర్థాంతరంగా ఆగిపోయింది. వచ్చే సంవత్సరం ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత బ్రేక్ ఫాస్ట్ , ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పెడుతామని బడ్జెట్ ప్రవేశపెడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క గారు ప్రకటించారు. మనది సంక్షేమ రాజ్యం. నేటి బాలలే రేపటి పౌరులు. పిల్లల్ని చదివించడం ప్రభుత్వ బాధ్యత, అర్ధాకలితో బడికి రావద్దని వారికి పోషక ఆహారంతో కూడిన మధ్యాహ్న భోజనం కూడా పెట్టడం ప్రభుత్వం బాధ్యత. అందుకోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ బడులకు వచ్చే ఏ పిల్లవాడు ఇబ్బంది పడవద్దని వచ్చే సంవత్సరం స్కూల్ బ్యాగ్, షూ కూడా అందచేస్తామని చెప్పారు.
కావున పిల్లలను అవమానిస్తూ, వారి హక్కులకు భంగం కలిగేలా బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన ప్రవచన కారుడుగా పేరున్న గరికపాటి నరసింహారావు పై బాలల హక్కులను ఉల్లంఘించినందుకు, చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి గారికి,డీజీపీ గారికి, బాలల హక్కుల చైర్ పర్సన్ గారికి, మానవ హక్కుల కమీషన్ చైర్మన్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఆ మేరకు వారందరికి బాలల హక్కుల సంక్షేమ సంఘం(బి హెచ్ ఎస్ ఎస్) పక్షాన విజ్ఞాపన పత్రములు పంపడం జరిగిందని వారు తెలిపారు.



**ఇంజమూరి రఘునందన్**

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి విడాలని రాష్ట్ర ఓసి ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు రామారావు డిమాండ్



**బషీర్ బాగ్ వెలుతురు 24 మార్చి :**
హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి. ఓసి, రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి. అన్న దాతలకు, విద్యార్థులకు, వివిధ కుల సంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఓసి, రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, ప్రధాన కార్యదర్శి సంది తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్బాగ్ లో ఓసి ఐకాస రైతు ప్రజాసంఘాల జాతీయ రాష్ట్ర వివిధ జిల్లాల నాయకుల తో నిర్వహించిన సమావేశంలో పోలాడి రామారావు, సంది తిరుపతి రెడ్డి ల తో పాటు పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు మాట్లాడారు రాష్ట్రంలో 70 శాతం మిగిలి ఉన్న రెండులక్షల రుణ మాఫీకి నిధుల కేటాయింపు చేయలేదని, బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి నిడుదల కేటాయింపులు తగ్గించిన ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీల ఊసే లేదని , అన్ని రకాల పంటలకు 500 రూ బోనస్ ఇవ్వకుండా కేవలం సన్న రకాలకు అడపా దడపా అర కోరగా ఇస్తూ మోసాగించిందన్నారు . ఇప్పటికే రెండుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిన ప్రభుత్వం నామ మాత్రంగానే విడుదల చేసి రైతులను దేహీ అనే విధంగా హీనంగా పరిగణించే సర్కార్ కు రైతన్నల ఉసురు తగలక తప్పదని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ నిడుదల విడుదల చేయడం లేదని అన్నారు నామ మాత్రంగానే ఓసి రెడ్డి కార్పొరేషన్ లను ప్రకటించిన ప్రభుత్వం పాలక మండళ్లు ఏర్పాటు చేయలేదని బడ్జెట్లో లో నిడుదల కేటాయించక రెడ్డి ఓసి లను మోసగించిందన్నారు . ఈ నేపథ్యంలో అన్నదాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అన్నీ వర్గాల కుల సంఘాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 28 న ఓసి జేఏసీ రైతు ప్రజాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో లక్షలాది మంది తో రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమరభేరి సభను న భూ తో న భవిష్యత్ తరహా లో నిర్వహిఇస్తున్నామని పార్టీల కతీతంగా అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తున్నామని శరవేగంగా సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్నాయని పోలాడి రామారావు తెలిపారు. కరీంనగర్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమర భేరి సభలో ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నాం రైతుకు పూర్తిగా 2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు భరోసా నిధులను పంట సాగు సమయంలోనే విడుదల చేయాలని ఇచ్చిన హామీల మేరకు అన్ని రకాల పంటలకు క్వింటాలుకు 500 బోనస్ ను ధాన్యపు కొనుగోలు సమయంలోనే చెల్లింపులు చేయాలనీ కౌలు రైతులకు హామీ నెరవేర్చాలి, ప్రస్తుతం అమలు చేస్తున్న మద్దతు ధర కాకుండా రైతుకు పెట్టుబడి తగ్గట్టుగా గిట్టుబాటు ధర అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలి, ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలి, ఆయకట్టు చివరి భూముల వరకు నీళ్లు అందించే విధంగా వాటర్ మేనేజ్మెంట్ చేయాలి గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరత ఉన్నందున జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే వ్యవసాయానికి అనుసంధానం చేయాలి, రైతు బీమా వయోపరిమితిని 59 ఏళ్ల నుండి 70 ఏళ్ల వరకు పెంచాలి 50000 ఏద్దైనా ప్రతి రైతుకు నెలకు 6000 రూపాయల జీవన భృతి కల్పించాలి. ప్రతి రైతుకు ఆరోగ్య సమస్యల చికిత్స నిమిత్తం 20 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాన్ని కార్పొరేట్ హాస్పిటల్ లో అవకాశం కల్పించాలి, నామాత్రంగా ఏర్పాటు చేసిన రెడ్డి కార్పొరేషన్ కు తక్షణమే నిధులు కేటాయించి పాలకమల్ని ఏర్పాటు చేయాలి. రైతులకు వ్యవసాయ యాంత్రికరణ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 75% సబ్సిడీతో అందించాలి, ఆర్థికంగా వెనుకబడిన అగ్రకుల పేదల సంక్షేమానికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పటిష్టమ అమలుకై జాతీయ రాష్ట్రస్థాయి ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయం ఒకే రకమైన వార్షిక ఆదయ పరిమితిని పెంచాలి. ఈడబ్ల్యూ ఎస్ అర్హతకు అధికారులు జారీ చేసే సర్టిఫికెట్ కఠిన షరతులు లేకుండా ఐదు సంవత్సరాల వరకు పరిమితి ఉండేలా వర్తింప చేయాలి. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు ఇచ్చిన హామీ మేరకు ఏటా జాబు క్యాలెండర్ ప్రకటించి భర్తీ చేయాలని ప్రభుత్వాలను రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి లు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఓసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉత్తర తెలంగాణ జిల్లాల అధ్యక్షుడు పెండ్యాల రాంరెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఏనుగు చొక్కా రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మహంకాళి రాజన్న,రెడ్డి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బండ గోపాల్ రెడ్డి, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ , వైశ్య సంఘాల జేఏసీ చైర్మన్ చకిలం రమణయ్య తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్ట్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


**-కొలను హనుమంత రెడ్డి.**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 24:**
నిజాంపేట జర్నలిస్టు కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలను హనుమంతు రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జర్నలిస్టు కాలనీవాసులు సమస్యల పరిష్కారం కోసం హనుమంత రెడ్డిని అభ్యర్థించారు. ప్రధానంగా జర్నలిస్టు కాలనీలో 2010 సంవత్సరంలో వేసిన భూగర్భ డ్రైనేజీ లైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ప్రతిరోజు లీకేజీలు అవుతూ రోడ్లపై పొంగిపొర్లుతున్నాయని జర్నలిస్టు కాలనీవాసులు హనుమంత్ రెడ్డికి వివరించారు. పురాతన డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మార్చి వేయించి నూతన డ్రైనేజీ పైపులైన్ల ను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే 2007లో ఏర్పాటైన జర్నలిస్టు కాలనీ వాసులకు సామాజిక అవసరాల కొరకు ఎలాంటి స్థలం కేటాయించలేదని, కాబట్టి కాలనీ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 334లో కమ్యూనిటీ హాల్, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయములకు శాశ్వతంగా స్థల కేటాయింపుల విషయమై చొరవ తీసుకోవాలని జర్నలిస్టు కాలనీవాసులు కోరారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా కాలనీలో జరగను న్న కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ 2007 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టు కాలనీ ఏర్పాటు చేసిందని, కాలనీలో ప్రధానమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కొలను హనుమంత్ రెడ్డిని కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, వార్త ఎ.గోవింద రావు , దేవేందర్ గుప్తా, భవ్య టీవీ సత్యనారాయణ, రమేష్, కృష్ణారావు,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ కీ.శే.ఆచార్య జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ

**ప్రగతినగర్ అలీప్ సర్కిల్‌లో విగ్రహావిష్కరణ వేడుక.**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 24:**
తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య జయశంకర్ సార్ విగ్రహాన్ని ప్రగతినగర్‌లోని అలీప్ సర్కిల్‌లో మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన కృషి వెలకట్ట లేనిదని కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యతని, ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని పలువురు నేతలు ఈ వేడుకలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్ కి ఘన నివాళులు అర్పించారు. అలీప్ సర్కిల్‌లో జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విగ్రహం భవిష్యత్ తరాలకు తెలంగాణ ఉద్యమ చరిత్రను గుర్తు చేసే స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందని విగ్రహ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు జి. వేణుగోపాలరావు, ఎస్. శివకుమార్, ఎన్. రవికుమార్, ఏ. వీర్రాజు, ఎస్. సందీప్, టి. ఈశ్వర్, ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బండాలేమూర్ గ్రామంలో హెరిటేజ్ డైరీ పాలసేకరణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు





**మంచాల వెలుతురు మార్చి 24:**
మంచాల మండలం బండలేమూర్ గ్రామంలో హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యలో బండలేమూర్ గ్రామం లోహెరిటేజ్ సంస్థ ఆధ్వర్యలోఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు పశు వులకు సిజినల్ వ్యా ధులు ప్రబల పడకుండా రైతులు వాటిపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రభా కర్ సుచించారు ముఖ్యంగా వాటికి కావల్సిన నట్టల మాత్రలు కాల్షియం మినరల్ మిక్సర్ వాడ కం మరియు దాన వాడకం విధానం రైతులకు తెలియజేశారు అదే విధంగా పశువులకుఇన్సూ రెన్సుసౌకర్యం ఉందని తెలియజేశారు రైతులు హెరిటేజ్ సేవలు ఉపయోగించుకోవాలనారుఈ కార్యక్రమంలోయాచారం బీఎంసి మేనేజర్ శ్రీనివాస్ నాయుడు బండలేమూర్ హెరిటేజ్ పాలసే కరన కేంద్రం నిర్వహకులు గునుకులపరమేశ్ యాదవ్ హెరిటేజ్ పాడి రైతులు వట్టి పెద్దులు బీ మనమోని వెంకటయ్య,పతులోత్ శ్రీకాంత్ వర్త్యలక్ష్మ,జోగురాజు జోగుశంకర్ జర్పుల సుఖ్య సా గర్ రాజేందర్ శంకర్ బాలు గునుకుల ఎల్లయ్య వట్టి పరమేశ్ మారయ్య మహమ్మద్ పాషా జపాల నవీన్ జక్కుల శంకరయ్య పతులోత్ బిచ్చ పాండు తదితరులుపాల్గొన్నారు

## రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాతో రైతుల జీవితాల్లో భరోసా నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**- ఆరుట్ల గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్**



**మంచాల వెలుతురు మార్చి 24:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ యూత్ కాంగ్రెస్అధ్యక్షు డు బుడిగలపరమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రై తుల జీవితాల్లో వెలుగులు నింపిందని మరియు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో రైతులకు పెద్దపీట వేసిందనిఅన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం లా గా కల్లి బొల్లి మాటలు చెప్పిపబ్బంగడుపుకునే ప్రభుత్వం కాదని ఇది చేతల ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం కాబట్టి 2026-27 వార్షిక బడ్జెట్ లో వ్యసాయశాఖకు 23,179 కోట్లు కేటాయించడం జరిగిందని అన్నారు తాజాగారైతుభరోసా డబ్బులను తొలి విడతలో భాగంగా ఎ కరానికి 6000రూపాయల చొప్పున రైతుల ఖాతాలో జమచేయడం జరిగిందని అదే విధంగా మూడు విడతల్లో మిగతా మొత్తం జమచేయడం జరుగుతుందని అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వం ప్రజా పాలన ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకునే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంఅనిఅన్నారు

## విపంచి ఫౌండేషన్ "అక్షర మిత్ర " ఉగాది పురస్కారం అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్.

**- ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం**

**- ఉగాది పురస్కారం తో భాద్యత మరింత పెరిగింది:జర్నలిస్ట్ టి. రమేష్**





**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 24:**
విపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారం ను సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ సోమవారం రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమం లో ఏనుగు నర్సింహారెడ్డి ఐ ఏ ఎస్ చేతులమీదుగా రవీంద్రభారతి లో ప్రముఖుల సమక్షంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలలో కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ ప్రతీ ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సీనియర్ జర్నలిస్ట్ టి. రమేష్ ని విపంచి ఫౌండేషన్ ప్రత్యేక జూరి కమిటీ ఎంపిక చేసింది. పత్రికా రంగంలో టి రమేష్ చేస్తున్న కృషికి గాను ఈ అవార్డును ప్రకటిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం ) కు చెందిన రమేష్ భువనగిరి లోని డిగ్రీ చదువుకున్న సమయం నుండే జర్నలిజం పై ఆసక్తి తో పలు పత్రికలో స్థానిక సమస్యల స్పందిస్తూ సుమారు 30 సంవత్సరాలనుండి సాహిత్య పరిశోధక వ్యాసాలతో తెలుగు భాషా సాహిత్యానికి తనవంతు సేవలు అందిస్తున్నాడని అన్నారు. చిన్న వయస్సులోనే సాహితీ మాగాణంలో చెరగని ముద్రను వేసుకున్నాడని తెలిపారు. జర్నలిస్ట్ టి.రమేష్ నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో జర్నలిస్ట్ గా పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్ లో మరిన్ని రచనలు చేసి తెలంగాణకు మరింత ఖ్యాతిని తీసుకురావాలని కాంక్షించారు.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన వరల్డ్ వాటర్ డేలో కేర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు





**నల్లకుంట మార్చి 24 (వెలుతురు):**
ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన వివిధ కార్యక్రమంలో నల్లకుంటా కేర్ మోడల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎలక్ట్యూషన్లో ఆరుగురు విద్యార్థులు మరియు స్లోగన్ రైటింగ్ లో ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కేతన అనే విద్యార్థిని స్లోగన్ రైటింగ్ లో రెండవ బహుమతి సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఆర్.టి.ఐ కమిషనర్, పర్యావరణవేత్త దిలీప్ రెడ్డి నీటి సంరక్షణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేర్ మోడల్ హైస్కూల్ విద్యార్థినిలు జాహ్నవి, సుప్రియ, సాత్విక, కేతన, సాయి లక్ష్మి, సాన్విక, దయాక్షి, సాహిత్య, హనీ శ్రీ, భవ్య, సుశానిహారిక, నిత్య లు పాల్గొన్నారు.

## 28న జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారానికి బంగారు అవకాశం




**కుషాయిగూడ, మార్చి 24 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాలలో ఒకేసారి నిర్వహించబడనుంది.లోక్ అదాలత్ ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర అవగాహనతో, సఖ్యతతో పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రజలకు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా సివిల్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, భూ వివాదాలకు సంబంధించిన కేసులను ఈ వేదికపై త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.సాధారణ కోర్టు ప్రక్రియలతో పోలిస్తే లోక్ అదాలత్ ద్వారా కేసులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పరిష్కారమవుతాయని, ఇరు పక్షాలకు అనుకూలంగా ఉండే విధంగా సర్దుబాటు జరుగుతుందని ఆయన వివరించారు. కోర్టుల్లో పెండింగ్ భారాన్ని తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.అందువల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ న్యాయ సమస్యలను సులభంగా, వేగంగా ముగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిలుపునిచ్చింది.

## తెలంగాణ రాష్ట్రంలో ఒకే రెడ్డి సంఘంగా ఏర్పడిన రాష్ట్ర రెడ్డి సంఘాలు

**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**
హైదరాబాద్ నాగోల్ ప్రాంతంలో పిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో బద్దూరి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన నూతన హడ్ హాక్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రెడ్ల భవిష్యత్తు భద్రత ఆర్థిక రాజకీయ అసమానతలు ఎదురవుతున్న ఇబ్బందుల దృశ మంగళవారం రోజున అన్ని సంఘాలు కూడా ఏకవాక్య తీర్మానంతో ఒకే సంఘాన్ని రాష్ట్రంలో ఒకటే రెడ్డి సంఘం ఉండాలనే నినాదంతో అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఈ యొక్క సాహో సపేతమైన నిర్ణయం తీసుకోవడం చరిత్రత్మకం.అని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేద రెడ్లకు పేదరెడ్డి విద్యార్థులకు మేమున్నామని ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్కరికి కూడా భవిష్యత్తు కోసం వారికి భరోసా ఇవ్వడం జరుగుతుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకవర్గంతో పాటు బడ్జెట్ కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం




జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆయా సామాజిక వర్గ ప్రజలకి రాష్ట్ర స్థాయిలో ఏదైతే ప్రభుత్వాలు వారికి హైదరాబాద్ నడిబొడ్డున కుల భవనాలు నిర్మించిందో అదే విధంగా తెలంగాణ రాష్ట్ర రెడ్ల కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది. రానున్న రోజుల్లో సంక్షేమం కోసం ప్రభుత్వానికి మరియు పేద రెడ్లకు మధ్యలో వారధిగా ఉండి పేదరేడ్ల సంక్షేమానికి ముందు ఉంటామని కొత్తగా ఏర్పడిన కార్యవర్గం ఈ సందర్భంగా వారు అన్నారు .



రాష్ట్ర అడ్ హాక్ కమిటీ చైర్మన్గా బద్దూరి వెంకటేశ్వర రెడ్డి కన్వీనర్ గా బుట్టెంగారి మాధవరెడ్డి, కో కన్వీనర్లుగా నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, కొట్టం మధుసూదన్ రెడ్డి వసంత రెడ్డి నూకల పద్మ రెడ్డి గంగుల శ్రీలత రెడ్డి నందికొండ గీతరెడ్డి సభ్యులుగా ఎన్నేపల్లి లింగారెడ్డి ఎలిమినేటి సుమన్ రెడ్డి సలహా దారులగా ఏనుగు సంతోష్ రెడ్డి పిట్టా శ్రీనివస్ రెడ్డి గోపు జైపాల్ రెడ్డి నల్ల సంజీవరెడ్డి నావల్గా సత్య నారాయణరెడ్డి బొక్క భూపాల్ రెడ్డి బొబ్బిలి దామోదర్ రెడ్డి నియమించబడ్డారు

## 2025- 26 కు సంబంధించి ప్యాడి కొనుగోలు పై జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమము



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 24**
రాబోయే రబీ మార్కెటింగ్ సీజన్ 202526 కు సంబంధించిన ప్యాడి కొనుగోలు ఎంట్రీల పై జిల్లా స్థాయి అవగాహన , శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశం లో అదనపు కలెక్టర్ విక్టర్ రెవెన్యు అధ్యక్షత వహించిన ఈ ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్, ఐ కె పి,వంటి కొనుగోలు సంస్థలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 01 ఏప్రిల్ 2026 నుండి ప్యాడి కొనుగోలు కేంద్రాలు (పి పి సి లు) ప్రారంభం కావడానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్ని సంస్థలకు స్పష్టమైన సూచనలు జారీ చేయబడినవి. ప్రతి పి పి సి,లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుట పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడి క్లీనర్లు , ఇతర అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే రైతుల వివరాలు సరిగా, తక్షణం నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, నాణ్యత ప్రమాణాలు , తేమ శాతం పాటించడం, ప్రభుత్వ కొనుగోలు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం పై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సమయపాలన తో కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం రెండు సెషన్లలో ఉదయం సెషన్ (10:30 AM నుండి 1:30 PM వరకు): కామారెడ్డి ,ఎల్లారెడ్డి నియోజకవర్గాలు మధ్యాహ్నం సెషన్ (2:00 PM నుండి 5:00 PM వరకు): బాన్సువాడ , జుక్కల్ నియోజకవర్గాల వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో డి ఆర్ డి ఏ,ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా సహకార అధికారి (డి సి ఓ), జిల్లా సివిల్ సప్లైస్ అధికారి (డి సి ఎస్ ఓ), జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) పాల్గొన్నారు.



## "ముచ్చర్ల లో హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్‌కు నివాళి అర్పించిన ఎంఆర్‌పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగ"

**హుస్సేన్ నాయక్ తల్లిని పరామర్శించి, హుస్సేన్ నాయక్ తో ఉన్న అనుభందాన్ని గుర్తుచేసిన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**



**గూడూరు వెలుతురు మార్చి 24:**
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం, ముచ్చర్ల గ్రామానికి విచ్చేసిన జాతీయ నాయకులు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జాతీయ ఎస్ టి కమిషన్ మెంబెర్ జాటోత్ హుస్సేన్ నాయక్ గారి తండ్రి కీ,,శే,, లచ్చు నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.తన తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న హుస్సేన్ నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను మందకృష్ణ మాదిగ ఓదార్చి ధైర్యం కల్పించారు.. స్వర్గీయ లచ్చా నాయక్ వంటి వ్యక్తిని కోల్పోవడం ఆ కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని, హుస్సేన్ నాయక్ తల్లి గారిని కలిసి తన బాగోగులు తెలుసుకొని, ధైర్యం చెప్పి దేశ స్థాయి లో పేరు తెచ్చుకంటున్న మంచి కొడుకులకు జన్మనిచ్చిన మీకు మీ కొడుకులతో మంచి పేరు, ప్రతిష్టలు దేశస్థాయిలో పెరిగాయాని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా కొనియాడి, లచ్చా నాయక్ పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని, వారి కటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెకీయజేసారు .. ప్రముఖ వ్యక్తి జాతీయ ఎస్ టి కమిషన్ మెంబెర్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చు నాయక్ ఇటీవల కన్నుమూసిన విషయం



తెలుసుకొని , ఆయన స్మారకార్థం నిర్వహించిన నివాళి కార్యక్రమం సోమవారం అత్యంత భావోద్వేగపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి ప్రముఖ రాజకీయ, సామాజిక నేతలు హాజరై నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మందకృష్ణ మాదిగ తో మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్,బీజేపీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి,గుగ్గిళ్ల పీరన్న గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య గౌడ్, మాజీ ఎంపీపీ వెంకన్న,తండ సంపత్ కుమార్ గౌడ్, చీకటి కిరణ్,వీ~రా జిల్లా, మండల నాయకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తరలివచ్చిన అభిమానులు:
లచ్చు నాయక్ గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను, ఆయన వ్యక్తిత్వాన్ని గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మాచర్ల గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హుస్సేన్ నాయక్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నేతల రాకతో గ్రామంలో ఒక రకమైన భావోద్వేగ వాతావరణం నెలకొంది. లచ్చు నాయక్ చేసిన సేవలు ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని ప్రతి ఒక్కరూ కొనియాడారు.

## జనం పల్లి రెసిడెన్షియల్ స్కూల్లో ఆర్.బి.ఎస్.కె రామన్నపేట వారిచే ఉచిత వైద్య శిబిరం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 24:**
ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాదాద్రి డిఎంహెచ్వో డాక్టర్ మనోహర్, ఆర్ బి ఎస్ కే పి ఓ. డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్ బి ఎస్ కే డాక్టర్ జి, శ్రీకాంత్ స్పెషలిస్ట్ డాక్టర్ వీరన్న, పిడ్రీ యాట్రీ షన్ డాక్టర్ పాండు, డెంటల్ డాక్టర్ స్వాతి బాయి, గైనకాలజీ, డాక్టర్ శ్రీదేవి, ఆప్తమాలజిస్ట్, ఆర్ బి సి కే పారామెడికల్ స్టాప్ కళ్యాణి జనం పల్లి రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ రాజు సమక్షంలో క్యాంపు నిర్వహించడం చేయడం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉచిత పరీక్షలు టెస్టులు నిర్వహించారు. మరియు



సిఆర్పి స్ట్రెస్ మేనేజ్మెంట్ గురించి చెప్పడం జరిగింది. విద్యార్థులో అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు పంపిణీ చేయడం జరిగింది.

## లోక్ అదాలత్ నిర్వహణకు ముందస్తు సమావేశం నిర్వహించిన న్యాయ అధికారులు



**జహీరాబాద్ వెలుతురు మార్చి 24:**
ఈ నెల 28-03-2026న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కోర్టు హాల్లో నేడు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సబ్ కోర్టు జడ్జి కవితా దేవి అధ్యక్షత వహించగా, జేఎఫ్‌సీఎం జడ్జి కలీల్, కుమారి బ్లెస్సీ పాల్గొన్నారు.ఈ సమావేశానికి డీఎస్పీ జహీరాబాద్ సైదా, ఏపీపీ అరవింద్, సీఐ జహీరాబాద్ టీ. శివలింగం, సీఐ ఆర్.జే. హనుమంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఏజీపీ దత్తాత్రేయ రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

## కామారెడ్డి లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తనిఖీ

**- ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలు తీసుకోవద్దు**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 24**
మంగళవారం నాడు ఫుడ్ సేఫ్టీ డిజిగేటెడ్ ఆఫీసర్ బి.శిరిష (కామారెడ్డి), ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జి.విక్రం (కామారెడ్డి) లు కామారెడ్డి బస్ స్టాండ్ సమీపంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను తనిఖీ చేశారు. పరిశుభ్రత లోపించడం, కృత్రిమ రంగులు వాడుతున్నందుకు హోటల్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఆరోగ్యానికి హానికరమైన కృత్రిమ రంగులు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవద్దని ప్రజలకు సూచించారు.

## వరల్డ్ టీబీ డే సందర్భంగా అవగాహన ర్యాలీ




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 24:**
బాయ్స్ హైస్కూల్ లో వరల్డ్ టీబీ డే సందర్భంగా విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ అశ్విని కుమార్ ఆధ్వర్యంలో గోపాల్ హెచ్ఈఓ జాతీయ క్షయ రోగ నిర్మూలన కార్యక్రమం లో భాగంగా క్షయ రోగులలో మైకో బాక్టీరియమ్ ట్యూబర్క్యులోసిస్ అనే బాక్టీరియాతో తుమ్మడం, దగ్గడం, మాట్లాడటం వలన తుంపరులతో ఒకరి నుండి ఇంకొకరికి వ్యాపించే అంటూ వ్యాధి అని, క్షయ వ్యాధి పైన అవగాహన వ్యాధి లక్షణాలు గుర్తించు విధానం పూర్తి చికిత్స పోషకాహారం,వ్యక్తిగత శుభ్రత, మాస్కులు ధరించుట క్షయ రోగులపట్ల ఆధరాభిమానాలు చూపించిన పూర్తి చికిత్స తీసుకునేటట్లు,చూడవలసిందిగా తెలియ జేసీ విద్యార్తులచే ర్యాలీ నిర్వహించనైనాది. ఈ కార్యక్రమం లో ఏఎన్ఎం మంజుల,హెడ్ మాస్టర్ ఎం. శేషచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండో-ఫిన్లాండ్ ఎడ్యుకేషన్ కనెక్ట్ లో మేఘా రెడ్డి



**మునుగోడు, మార్చి 24 (వెలుతురు ):**
న్యూఢిల్లీలోని ఫిన్లాండ్ రాయబారి కార్యాలయంలో నిర్వహించిన ఇండో-ఫిన్లాండ్ ఎడ్యుకేషన్ కనెక్ట్ కార్యక్రమంలో వెదిరె పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘా రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారతదేశంలోని ఫిన్లాండ్ రాయబారి కిమ్మో లాదేవిర్టా ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సమావేశంలో ఫిన్లాండ్ దేశంలో అమలవుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విద్యా విధానాలను భారతదేశంలో, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలపై చర్చించినట్లు వెదిరె మేఘా రెడ్డి తెలిపారు. ఈ అంశంపై ఫిన్లాండ్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా 42 ప్రముఖ విద్యాసంస్థల చైర్మన్లు,పాఠశాల సీఈఓలు,విద్యా రంగ నిపుణులు పాల్గొన్న కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి వెదిరె పూలమ్మ ఫౌండేషన్‌కు ఆహ్వానం అందడం విశేషమని పేర్కొన్నారు. విద్యా రంగంలో అంతర్జాతీయ సహకారం పెంపొందించడంలో ఈ సమావేశం ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# డిప్రెషన్ (మానసిక ఒత్తిడి) మనసును మెల్లగా అలసిపోయే నిశ్శబ్ద శత్రువు

ప్రస్తుత కాలంలో మనిషిని ఎక్కువగా వేధిస్తున్న సమస్య ఏదైనా ఉంటే, అది మానసిక ఒత్తిడి డిప్రెషన్. శరీరానికి వచ్చిన వ్యాధులకు మందులు ఉన్నాయి, శస్త్రచికిత్సలు ఉన్నాయి, సాంకేతిక పరిజ్ఞానం ఉంది. డబ్బు ఉంటే చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఎంతటి అనారోగ్యం వచ్చినా, మనిషిని బ్రతికించాలని వైద్యులు రోజురోజుకూ కొత్త పద్ధతులు కనిపెడుతున్నారు. కానీ మనసుకు వచ్చిన బాధకు మాత్రం ఒకే ఒక్క మందు ఉండదు. అందుకే డబ్బు, పేరు, ఖ్యాతి ఉన్నవాళ్లు కూడా డిప్రెషన్ బారిన పడుతున్నారు. కొంతమంది ఆ బాధను తట్టుకోలేక జీవితాన్ని సగం దారిలోనే ముగించుకున్న సంఘటనలు మనం విన్నాం, చూశాం. ఇంత అభివృద్ధి జరిగిన ఈ కాలంలో ఎందుకు ఇలా జరుగుతోంది?

మనిషి మానసికంగా బలహీనమయ్యాడా?

కాదు మనిషి బలహీనుడు కాదు. కానీ అతని ఆలోచనలు, అతని జీవన విధానం, అతని పరిసరాలు ఇవే అతనిని మెల్లగా ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ రోజుల్లో మనల్ని మానసిక ఒత్తిడికి నెట్టే కొన్ని కారణాలు:

అతిగా ఆలోచించడం

ఇతరులతో పోల్చుకోవడం

తక్కువ కష్టంతో ఎక్కువ సంపాదించాలని ఆశించడం

సామాజిక మాధ్యమాల ప్రభావం

ఇతరులపై అధిక అంచనాలు పెట్టుకోవడం

ఒంటరిగా ఎక్కువ సమయం గడపడం

మొదట ఒక చిన్న ఆలోచనగా ప్రారంభమైనది, మెల్లగా మనసులో పెరిగి పెద్ద భయంగా మారుతుంది. ఆ భయం ఒత్తిడిగా మారి, చివరికి మన ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మానసిక ఒత్తిడి ఒక్క కారణంతో రాదు. అది శారీరక, మానసిక, జీవశాస్త్ర సంబంధిత, ఆర్థిక, పరిసర సంబంధిత, వంశపారంపర్య వంటి అనేక అంశాల కలయికతో వస్తుంది. చాలా సార్లు, ఎవరో ఒకరు తమ బాధను చెప్పినప్పుడు "ఇంత చిన్న విషయానికే ఎందుకు ఇంత బాధపడుతున్నారు?" అని మనకు అనిపించవచ్చు. కానీ ఆ బాధను అనుభవిస్తున్న వ్యక్తికే దాని లోతు తెలుస్తుంది.

అందుకే మన చుట్టూ ఎవరైనా బాధలో ఉన్నారని తెలిసినప్పుడు:

వారిని ఎగతాళి చేయకండి



వారి బాధను చిన్నచూపు చూడకండి

వారితో ఓపికగా మాట్లాడండి

"నేను నీతో ఉన్నాను" అని చెప్పండి

ఎందుకంటే మానసిక ఒత్తిడిలో ఉన్నవాళ్లకు ఎక్కువగా కావలసింది మందులు కాదు.

ఒక మనసు, ఒక మాట, ఒక తోడు. ప్రపంచంలో ఉన్న ప్రతి మనిషి ప్రత్యేకుడు.

ప్రతి ఒక్కరి ఆలోచన, జీవితం, ప్రయాణం వేరు. మన జీవితం ఎలా ఉండాలో అనేది మన చేతుల్లోనే ఉంటుంది. ఇతరుల జీవితాలను చూసి మనల్ని మనం తక్కువగా భావించకూడదు. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవడం మంచిదే.. కానీ వాళ్ళలాగే ఉండాలి అనుకోవడం వల్ల మన ప్రత్యేకతను మనమే కోల్పోతాం. నువ్వు నీలా ఉంటేనే అందం. ఇంకొకరి లా మారాల్సిన అవసరం లేదు. వాళ్లు ఇప్పటికే ఉన్నారు.. ఈ ప్రపంచానికి నీ రూపంలో నువ్వే అవసరం. మనకు ఉన్నదానితో సంతోషంగా ఉండటం.. అది నిజమైన సంపద. జరిగేదాన్ని ఎవ్వరూ ఆపలేరు.. జరిగింది ఎవ్వరూ మార్చలేరు.. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు, మనసుకు శాంతి వస్తుంది. ఏ విషయం అయినా పదే పదే ఆలోచించడం వల్ల మనసు అలసిపోతుంది.. మనిషి నెమ్మదిగా ఆసక్తి కోల్పోతాడు.. జీవితం మీద ఆశ తగ్గిపోతుంది. అందుకే మన ఆలోచించే విధానం మారితే, మన జీవితం మారుతుంది. నువ్వు ప్రపంచాన్ని ఎలా చూస్తే, ప్రపంచం కూడా నీకు అలాగే కనిపిస్తుంది. ఈ చిన్న జీవితాన్ని ఎంత సంతోషంగా వీలైతే అంత సంతోషంగా జీవిద్దాం. ఒకరిని మరొకరు బాధ పెట్టకుండా,

నమ్మకద్రోహాలు, కుట్రలు, మోసాలకు దూరంగా ఉంటూ మన పని మనం చేసుకుంటూ ఆనందంగా ఉందుదాం.

పెద్దలు చెప్పిన కొన్ని సూత్రాలు ఎప్పటికీ నిజమే

"కర్మ ఎవరిని వదిలిపెట్టదు."

"పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు."


"ఈ భూమి మీద తప్పు చేయని మనిషి ఉండడు."

తప్పు చేసినప్పుడు దాన్ని సరిదిద్దుకుని ముందుకు వెళ్లడం అదే నిజమైన ధైర్యం.

ఇదే మన పిల్లలకు నేర్పుదాం..

మనం పాటిద్దాం..

సంతోషంగా జీవిద్దాం.



**జి . రజని రెడ్డి**

నవల రచయిత

# అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో అర్ధరాత్రి బిఆర్ఎస్వీ సీనియర్ నాయకుల అరెస్టు



**జహీరాబాద్ వెలుతురు, మార్చి 24:** అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులను పోలీసులు అర్ధరాత్రి అరెస్టు చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులు ఓంకార్, ఫయాజ్‌లను పోలీసులు అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టైన నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దాచిపెట్టేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ఇలాంటి చర్యలు చేపట్టడం సరైంది కాదన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అరెస్టుల ద్వారా విద్యార్థి ఉద్యమాన్ని అణచివేయలేరని, ప్రభుత్వం వెంటనే మేల్కొని విద్యార్థుల సమస్యలపై స్పందించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.

## కోహిర్ మున్సిపాలిటీ హాస్టల్ ప్రహరీ గోడ సరిహద్దుల పరిశీలన

**- కోహిర్‌లో స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అశోక్, తహసీల్దార్ సుప్రియ, ఎస్సై నరేష్...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 24:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలుర హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి సరిహద్దులను అధికారులు మంగళవారం పరిశీలించారు. కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, తహసీల్దార్ సుప్రియ, ఎస్సై నరేష్ కలిసి హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని సందర్శించి భౌగోళిక సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు స్థల పరిమితులను గుర్తించి ప్రహరీ గోడ నిర్మాణ పనులు ఎలాంటి వివాదాలు లేకుండా ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, నిర్మాణ సమయంలో ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా సరిహద్దులను స్పష్టంగా గుర్తించి నిర్మాణం చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వెంకటేశం, తహసీల్దార్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోహిర్ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పణ

**- ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే SIR కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 24:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో రానున్న ఏప్రిల్ నెలలో ప్రారంభమయ్యే SIR కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావాలని కోరుతూ ఈ రోజు మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ)కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమం అమలులో ఎవరూ మిగలకుండా ఉండేందుకు బీఎల్ఓల ద్వారా ఇంటింటికీ సర్వే నిర్వహించాలని వినతి పత్రంలో కోరారు. అలాగే గ్రామాలు, వార్డుల వారీగా ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్యక్రమం లాభాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్

- తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం
- క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం
- రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:** తెలంగాణ మట్టి లోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కపూర్ పోటీ నిర్వహించామని ఇది ఒక నిరంతర కార్యక్రమంలో గా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ప్రొసీల బహుకరణ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం క పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఒక నిరంతర పక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు.యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు.÷ఖఎం క పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతించి వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే పక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు. ÷-రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. ÷ాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం క పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆ÷-లనైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. వరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్ గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా రాష్ట్రస్థాయి ఐదుఅంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో అది ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలబడగా, రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సైనా నెహ్వాల్ సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతంకి కృషిచేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థలకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహూకరించింది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓ లు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

- అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:**



రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేమీ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్,మార్చి24 వెలుతురు:** క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేం÷-దర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా..మళ్లీ ఇది విజృంభించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాలజిస్టులు చేపట్టిన చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి



ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంత్ ,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎల్ఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలని వీరంతా సూచించారు.

## విజయవాడ హైవేలో ఎలివేటెడ్ కారిడార్

**- అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):** రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధికా ప్రాధాన్యం ఇస్తోందని ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తర్వాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో.. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై నారాయణరెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత పనామా వద్ద ఫ్లై ఓవర్ మంజూరు చేయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా.. డబుల్‌డెక్కర్ రోడ్డును మంజూరు చేయించుకున్నామన్నారు.

# రైతు కేంద్రిత పాలనకు నూతన దిశ
# రైతు భరోసాతో కాంగ్రెస్ సంకల్పం

## రైతు భరోసాతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి బలమైన పునాది

**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**
వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతుల స్థితి ఎలా ఉంటుందో అదే ప్రభుత్వ పనితీరుకు కొలమానం. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతును పాలనలో కేంద్రంగా ఉంచే దిశగా స్పష్టమైన మార్పు తీసుకువచ్చింది. ఈ మార్పుకు ప్రధాన ప్రతీకగా నిలుస్తున్నది రైతు భరోసా పథకం. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా రైతు సాధికారతకు, సమానత్వానికి, స్థిరత్వానికి దారితీసే విధానంగా రూపుదిద్దుకుంది.

**సాయం నుంచి భరోసాకు రైతు భరోసా నిర్మాణం**

రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి సంవత్సరానికి ₹12,000 సాయం అందిస్తున్నారు. ఇది ఖరీఫ్, రబీ సీజన్లలో రెండు విడతలుగా నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. గతంలో అమలులో ఉన్న రైతు బంధు పథకంతో పోలిస్తే ఇది పెరిగిన సాయం. కానీ మార్పు కేవలం మొత్తంలోనే కాదు అమలులో కూడా ఉంది. చెల్లింపుల్లో వేగం పెరగడం, నేరుగా ఖాతాల్లో డబ్బు జమ చేయడం వల్ల పారదర్శకత పెరిగింది. ఇటీవల ఒకే విడతలో ₹5,500 కోట్లకు పైగా విడుదల చేసి సుమారు 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చడం ప్రభుత్వం వేగవంతమైన అమలుకు నిదర్శనం.

**బడ్జెట్‌లో స్పష్టమైన సంకల్పం**

ప్రభుత్వ ప్రాధాన్యతలను బడ్జెట్ స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. 202526 తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశారు.

మొత్తం బడ్జెట్: 3.04 లక్షల కోట్లు
వ్యవసాయ రంగానికి:
24,000 కోట్లకు పైగాలి
రైతు భరోసా పథకానికి:
18,000 కోట్లులి

ఈ కేటాయింపులు వ్యవసాయాన్ని సంక్షేమ అంశంగా మాత్రమే కాకుండా అభివృద్ధి వ్యూహంలో భాగంగా భావిస్తున్నదని సూచిస్తున్నాయి.

**భారీ వ్యయం రైతు సంక్షేమానికి అంకితభావం**

ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, రైతు సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధికి ఇప్పటివరకు ₹1.4



లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారు. ప్రతి నెల సగటున ₹,000₹,500 కోట్ల వరకు రైతులకు సంబంధించిన పథకాలపై ఖర్చు చేయడం ద్వారా వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది.

**నగదు సాయం దాటి సమగ్ర దృక్పథం**

రైతు భరోసా కేవలం నగదు సాయం మాత్రమే కాదు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇతర చర్యలు కూడా రైతు జీవనోపాధిని బలోపేతం చేస్తున్నాయి.

2 లక్షల వరకు రైతు రుణమాఫీ
సన్న బియ్యానికి క్వింటాల్‌కు
500 బోనస్
భూ రికార్డుల సమస్యల
పరిష్కారం (భూ భారతి)
పంట విభిన్నీకరణకు ప్రోత్సాహం

ఈ చర్యలు రైతును తక్షణ ఉపశమనం నుండి దీర్ఘకాలిక స్థిరత్వం వైపు తీసుకెళ్తున్నాయి.

**రైతు బంధు నుంచి రైతు భరోసాకు పరిణామం**

గతంలో రైతు బంధు పథకం రైతులకు ఆర్థిక సాయం అందించినప్పటికీ, అమలు విషయంలో కొన్ని లోపాలు ఉన్నాయని విమర్శలు వచ్చాయి.ప్రస్తుత రైతు భరోసా పథకం ద్వారా సాయం పెరగడం, అమలు విధానం మెరుగుపడడం, పారదర్శకత పెరగడం వంటి మార్పులు చోటుచేసుకున్నాయి.

ఇది పూర్తిగా కొత్త పథకం కంటే ఒక పరిణామాత్మక మార్పుగా భావించ వచ్చు.

**పాలనపై నమ్మకం పునరుద్ధరణ**

రైతులు చాలా కాలంగా అనిశ్చితి పరిస్థితుల్లో జీవిస్తున్నారు, పంటల ధరలు, వర్షపాతం, అప్పులు వంటి అంశాలు వారిని ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిరంతర ఆర్థిక సాయం, సమయానికి చెల్లింపులు, స్పష్టమైన విధానాలు రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతున్నాయి.

**ముగింపు**

వ్యవసాయ రంగంలో సవాళ్లు ఇంకా కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వ చర్యలు రైతు సంక్షేమానికి ఒక స్పష్టమైన దిశను సూచిస్తున్నాయి. రైతు భరోసా పథకం, భారీ బడ్జెట్ కేటాయింపులు, అనుబంధ చర్యలు కలిసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి. రైతు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది అనే భావనతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో మరింత ప్రభావాన్ని చూపే అవకాశముంది.



**డా. రేఖ బోయలపల్లి**
వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

## మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

**- గతంలోనే హైకమాండ్ హామీ ఇచ్చింది**

**- మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్**

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**



కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో హామీనిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. హై కమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో వర్షం పడింది. పలు చోట్ల రహదారులపై భారీగా వరద చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి వంతెనపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మణికొండలో వడగళ్ల వాన కురిసింది. యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణనగర్‌లో రహదారులను వాన నీరు ముంచెత్తింది. బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వాన నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# అసెంబ్లీలో బడ్జెట్ పై అధికార పక్షం ప్రతిపక్షాల మాటల యుద్ధం..!?

## రాష్ట్ర బడ్జెట్ పై సాధారణ చర్చలో బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- బడ్జెట్ చూస్తే ఆశాభాసం పాట గుర్తుకు వస్తుంది
- హ్యాట్రిక్ చీటింగ్ బడ్జెట్ ను భట్టి ప్రవేశ పెట్టారనీరాష్ట్ర బడ్జెట్ పై సాధారణ చర్చలో బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

**మంత్రి శ్రీధర్ బాబు ఏమన్నారంటే...**


- బడ్జెట్ పవిత్రమైన డాక్యుమెంట్
- బడ్జెట్ ను చీటింగ్ బడ్జెట్ అంటారా
- తప్పు చెబితే చెప్పాలి.. చీటింగ్ పదాన్ని ఎందుకు వాడాలి
- చీటింగ్ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలి

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఏమన్నారంటే..**

- చీటింగ్ బడ్జెట్ పదాన్ని రికార్డుల నుంచి తొలగిస్తున్నాం

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

- ఎండమావి బడ్జెట్
- బడ్జెట్ కాగితాల మీద పరిమితమైంది.. 80 శాతం కూడా ఖర్చు చేయడం లేదు
- దేశంలో అతి తక్కువగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ
- కాగ్ నివేదిక చూస్తే అసలు రంగు బయటపడుతుంది
- 60 శాతం రీసీట్స్ మాత్రమే వచ్చాయి.. ఇంకా 40 శాతం రావాలి
- భట్టి, రేవంత్ మధ్య అగాధం లాగే లెక్కల మధ్య అగాధం కనిపిస్తుంది
- ఇప్పుడు కట్టాల్సిన అప్పును.. రాబోయే తరంపైన అప్పులు మోపుతున్నారు
- తెలంగాణలో పుట్టే ప్రతి బిడ్డ మీద రెండు లక్షల అప్పు మోపుడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలే కారణం
- 321రోజులు అప్పుల మీదనే రాష్ట్రం నడుస్తుంది
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతుంది
- ఆర్బీఐ ద్వారా అప్పులు తీసుకుంటే తప్పా రాష్ట్రాన్ని నడపలేని పరిస్థితి
- తప్పుడు అంకెలతో సభను తప్పుదోవ పట్టించారు
- అప్పుల విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు పొంతన లేదు
- రాజ్యాంగబద్ధమైన కాగ్ ఎప్పుడూ తప్పుడు లెక్కలు చూపెట్టదు



- సామాన్యుడిపై భారం మోపి బడ్జెట్ పెంచుకుంటున్నారు
- ఎక్సైజ్ ద్వారా ట్యాక్స్ లు విధిస్తుంది

**ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు**

- ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి
- 2 ఏళ్లలో కూడా ఎక్సైజ్ ఆదాయం 37వేల కోట్లే ఉంది
- రెవెన్యూ కొంత పెరిగింది
- గత ప్రభుత్వంతో పోలిస్తే 10 శాతం పెరగలేదు
- వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- క్కర్ ఆదాయం పెరగలేదు.. ట్యాక్స్ పెంచలేదు

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

- తెలంగాణ మూలధన వ్యయం సున్నా
- ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించలేదు
- అభయ హస్తం పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేటాయింపులు లేవు
- ఇందిరమ్మ ఇళ్లకు భారీ కోత విధించారు
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం వల్ల అనేక మంది చనిపోయారు
- ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మైనార్టీలకు భారీ నిధులు కేటాయించిన ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేసింది
- ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ నిధుల్లో భారీ కోత విధించారు
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయకపోవడం వల్ల వేల కోట్ల నిధులు మూలుగుతున్నాయి
- విద్యకు 9 శాతం ఉన్న బడ్జెట్ ను 7 శాతానికి కేటాయించారు
- ఎన్నికల హామీలో విద్యకు 15 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించారు
- వైద్యానికి 4.22కే కుదించారు
- రైతు డిక్లరేషన్ అమలు చేయకపోగా.. వ్యవసాయ బడ్జెట్ ను తగ్గించారు
- కోటి మంది మహిళలను కోటీశ్వర్లను ఎట్లా చేస్తారు
- మహిళలకు సరైన కేటాయింపులు లేవు, వడ్డీలేని రుణాలు ఇవ్వలేదు, తులం బంగారం ఇవ్వనప్పుడు కోటీశ్వరులు ఎట్లా అవుతారు

**మంత్రి సీతక్క**

- వచనాలు మహేశ్వర్ రెడ్డి బాగానే పలుకుతున్నారు
- కేంద్రం ఇచ్చే దివ్యాంగుల 3 వందలు, వితంతువులు రెండు వందల ఫించన్ ఎందుకు పెంచలేదు
- రైతు నల్ల చట్టాలను తీసుకువచ్చింది బీజేపీ ప్రభుత్వం
- వ్యవసాయం గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదు
- మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు
- చర్చకు సిద్ధం ఇప్పటి వరకు 57వేల కోట్ల రూపాయలు ఇచ్చాం
- కేంద్రం మాత్రం మద్దతు ఇవ్వడం లేదు
- మా దగ్గర నుంచి తీసుకుంటున్నారు తప్పితే.. మాకు ఇవ్వడం లేదు
- ఎనిమిది మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రం నుంచి తీసుకురండి
- కోటీశ్వర్లను చేస్తామని కల కనడం తప్పా
- సంకల్పం పెట్టుకుని పని చేస్తుంటే ఎగతాళి చేస్తున్నారు

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

- కాంగ్రెస్ పార్టీ మాదిరిగా మేనిఫెస్టో రాయలేదు, హామీలు ఇవ్వలేదు
- తెలంగాణకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో 80 శాతం నిధులు కేటాయించాం
- కేంద్రం తెలంగాణకు ఎన్ని నిధులు ఇచ్చింది చర్చకు సిద్ధం
- 57 వేల కోట్లు గ్రాంట్ల రూపంలో వచ్చాయి
- కేంద్రం ఇన్ని రకాలుగా ఆదుకున్నా.. బద్నాం చేయడం సరైంది కాదు
- ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరడం తప్పా
- మా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కేంద్రంపైన నిందేలు వేస్తున్నారు
- లబ్ధిదారుల కోతను లక్ష్యంగా ఈ ప్రభుత్వం పెట్టుకుంది
- పారదర్శకత ఎక్కడ ఉందో భట్టి విక్రమార్క చెప్పాలి
- నిరుద్యోగులను ఆదుకోకపోతే వారి పక్షాన నిలబడి కొట్లాడుతామని సభా సాక్షిగా హెచ్చరిస్తున్నాం
- వ్యవసాయ సంక్షోభాన్ని ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతుంది
- హైదరాబాద్ చుట్టూ పక్కల ఉన్న భూములను అమ్మాలని ప్రభుత్వం చూస్తుంది
- నగరంలో ట్రాఫిక్ రద్దీ, దోమలు, చైన్ స్నాచింగ్ లు పెరిగిపోయాయి
- నగరాన్ని మూడు కార్పోరేషన్లుగా ఎందుకు విభజిస్తున్నారు
- మజ్లీస్ కు మేలు చేయడం కోసమే జిహెచ్ఎంసిని విభజిస్తున్నారు
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు
- రెండు వందల యూనిట్ల విద్యుత్ ఉచితమని చెబుతూనే డొమెస్టిక్ ఛార్జీలు పెంచారు
- వంద కోట్ల ఆదాయం తెచ్చే కార్గో మూడు వేల కోట్లు తేవడం లేదు
- 25 ఎకరాల దేవాదాయ భూములు కబ్జా అయినట్లు తెలుస్తుంది
- దేవాదాయ చట్టం ప్రకారం దేవాలయ భూములను ఎందుకు పరిరక్షించేలదు
- ఉపాధి హామీ పథకం పని దినాలు 125 రోజులకు పెంచితే మీకు ఉన్న ఇబ్బంది ఏంటి
- ఇరిగేషన్ శాఖకు ఎందుకు నిధుల కొరత విధించారు
- ప్రాణహిత, చేవెళ్ల వంటి ప్రాజెక్టు కు ఎందుకు నిధులు తగ్గించారు
- ఇందిరమ్మ రాజ్యం పేరుతో ఇల్లు కొలుస్తున్నారు

**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**

## నేటి డిజిటల్ యుగంలోనూ

**- వార్తల ప్రసారంలో ఆకాశవాణి పాత్ర సుస్థిరం**

**- ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్**

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నాయని, ఆకాశవాణి డైరెక్టర్ జనరల్, శ్రీ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుం దని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని కవాడీ గూడ సిజిఓ టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ ఓ÷ూ మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెళకువలను పెంపొంది స్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందనీ పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌గా ఆకాశవాణిలో ఖచ్చితత్వం, ధర్మనిష్టను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ, వాట్సప్ యూనివర్సిటీ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఖఎః లో ప్రారంభించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం గురించి వివరించారు . ప్రభుత్వ కమ్యూనికేటర్లుగా విలేకరులు క్షేత్రస్థాయి అభివృద్ధి నివేదికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ, ఆకాశవాణి విశ్వసనీయతకు, సమగ్రతకు, సంపూర్ణతకు మారుపేరు అని చెప్పారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని విశ్వసనీయతను పోగొట్టుకోకుండా ఆకాశవాణి ప్రఖ్యాతిని అలాగే నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ.. 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణి లో వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉర్దూ శ్రోతలను దృష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ ప్రారంభించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. పలు అంశాలపై సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు శిక్షణా తరగతులు నిర్వహించారు. 'మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ తయారీ' అనే అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్. దిలీప్ రెడ్డి అవగాహన కల్పించారు.

'సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం' అనే అంశంపై హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ ఆస. కూర్మనాథ్ వివరించారు. 'న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ బదిలీ, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం' అనే అంశంపై ఐ న్యూస్ సీఈఓ, చీఫ్ ఎడిటర్ ఏ కే సాగర్ విశ్లేషించారు. అలాగే, 'ఫాక్ట్ చెక్, సోషల్ మీడియా హ్యాండిల్స్ మెరుగుపరచడానికి సోషల్ మీడియా టెక్నిక్స్' అనే అంశంపై ఫాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మారుతున్న మీడియా పరిస్థితులలో ఆకాశవాణి విలేకరులకు కొత్త దిశానిర్దేశర లభించింది.

# సిఎం చంద్రబాబుతో సంజయ్ దత్ భేటీ

- అమరావతిలో ఫిలిం సిటీ వ్యవహారాలపై చర్చ



**అమరావతి,మార్చి24 వెలుతురు:**
అమరావతిలో త్వరలోనే ఏపీలో భారీ సినీ స్టూడియోలు లేదా అంతర్జాతీయ స్థాయి ఫిలిం సిటీ నిర్మాణంపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. మంగళవారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సంజయ్ దత్ బృందం నేరుగా వెలగపూడిలోని సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. గత ఫిబ్రవరిలో ముంబై వేదికగా మంత్రి నారా లోకేశ్‌తో జరిగిన చర్చల కొనసాగింపుగానే ఈ పర్యటన సాగుతున్నట్లు తెలుస్తోంది. సంజయ్ దత్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన ముగ్గురు కీలక ప్రముఖులు ఈ భేటీలో పాల్గొన్నారు. గౌరవ్ దూబే , కునాల్ పటేల్, అనుజ్ కుమార్ వీరిలో ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒక భారీ ఫిలిం సిటీ లేదా సినిమా హబ్ అవసరం ఎంతైనా ఉంది. గతంలో లోకేశ్‌తో జరిగిన భేటీలో సంజయ్ దత్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఈ ఫిలిం సిటీని అమరావతి పరిసరాల్లో లేదా విశాఖపట్నంలో ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. సినిమా షూటింగ్‌ల కోసం ఏపీని ఒక గమ్యస్థానంగా మార్చడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలపై సీఎం చంద్రబాబు సంజయ్ దత్ బృందానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏపీలో సినిమా ఇండస్ట్రీకి అవసరమైన లొకేషన్లు పుష్కలంగా ఉన్నాయి. సంజయ్ దత్ వంటి అగ్ర నటులు ఇక్కడ స్టూడియోలు లేదా ఫిలిం సిటీలను నిర్మిస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బాలీవుడ్, సౌత్ సినిమాల కలయికతో ఏపీ సినీ హబ్‌గా మారుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.
అంబేడ్కర్ ఓవర్సీస్ పథకంతో 2వేల మందికి లబ్ది

# అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
విదేశీ విద్య ఉపకార వేతనాల పథకాన్ని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సుమారు 2వేల మంది విద్యార్థులకు విదేశీ విద్య ద్వారా ఉపకార వేతనాలు చెల్లించామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. దీనికోసం ఇప్పటి వరకు రూ.607 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. విదేశాల్లో చదువుకునే వారికి ఈ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని చెప్పారు. అంతకుముందు కేటీఆర్ మాట్లాడుతూ 2025 అక్టోబర్‌లో విదేశీ విద్య ఉపకార వేతనాలు ఇస్తామని చెప్పినా ఇవ్వలేదన్నారు. విదేశాలకు వెళ్లిన విద్యార్థులు దీనికోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు కట్టలేక.. ఇక్కడికి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని అమలు చేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విదేశీ విద్య ఉపకార వేతనాలు ఎస్సీ వర్గాలకే మేలు చేస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప÷–లాన్‌ను వంద శాతం అమలు చేయాలని.. దీంతో ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని.. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయడం లేదన్నారు. మాల, మాదిగలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు దానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

# 4473 ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదల

- హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ గౌతం

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు సకాలంలో బిల్లుల విడుదలకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా 4473 మంది కి రూ.48.79 కోట్లను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం తెలిపారు. ప్రతివారం ఇండ్ల నిర్మాణ దశలను బట్టి లబ్దిదారులకు బిల్లులను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. గత వారానికి సంబంధించి రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసిన 1969 మంది లబ్దిదారులకు రూ.17.23 కోట్లు, స్లాబు పూర్తి చేసిన 2504 మందికి రూ.31.56 కోట్లు విడుదల చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లక్ష ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ఆ దిశలో ఫలితాలు సాధిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇంతవరకు లబ్దిదారులకు రూ.5376.22 కోట్లను విడుదల చేసినట్లు ఎండి శ్రీ గౌతం వివరించారు. ఇంటి నిర్మాణపు పురోగతిని బట్టి విడతల వారీగా లబ్దిదారులకు రూ.5 లక్షలను అంద చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంతవరకు బేస్ మెంట్ నిర్మాణం పూర్తి అయిన వాటికి రూ. 2125.98 కోట్లు, గోడలు పూర్తి అయి రూఫ్ లెవల్ వరకు వచ్చిన ఇండ్లకు రూ.1518.51 కోట్లు, స్లాబ్ పూర్తి అయిన వాటికి రూ.1731.73 కోట్లు విడుదల చేశామని ఆయన తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 2.65 లక్షల ఇండ్ల పనులు ప్రారంభంగా కాగా, వాటిలో ఇంతవరకు 1,13,365 ఇండ్ల స్లాబు పూర్తి అయ్యిందని, 34,552 ఇండ్లు రూఫ్ లెవల్ (గోడల నిర్మాణం పూర్తి) దశలో ఉన్నాయని, మరో 61 వేల ఇండ్ల బేస్ మెంట్ నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఆయన వివరించారు.

# ఢిల్లీ అసెంబ్లీ స్పకర్‌కు బెదిరింపు మెయిల్

- మోడీ,అమిత్ షా,జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక
- ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ,మార్చి24( వెలుతురు):**
దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బ్జడెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

# లొంగిపోయిన మావోయిస్ట్ నేత పాపారావు

**బీజాపూర్,మార్చి24( వెలుతురు):**



మావోయిస్టు అగ్రనేత పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 17 మంది అనుచరులతో బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. వారి నుంచి భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతానికి చెందిన పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. అతడిపై 50 కేసులు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ అపహరణ ఉదంతంలో పాపారావు కీలక పాత్ర పోషించాడు. 76 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలోనూ ఇతడి హస్తం ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# ఏకాగ్రత, రణతంత్రకు వేదిక లాన్ టెన్నిస్

- టీమ్ స్పిరిట్ ను మరింత బలోపేతం చేసే క్రీడ
- పోలీస్, పారా మిలటరీ దళాల్లో క్రీడలకు ప్రాధాన్యం
- 26వ ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ను ప్రారంభించిన కేంద్ర మంత్రి










**న్యూఢిల్లీ వెలుతురు మార్చి 24:**
వేగవంతమైన నిర్ణయ సామర్థ్యానికి, సమతుల్యతకు, ఏకాగ్రతకు, రణతంత్ర ఆలోచన వంటి లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి సరైన వేదిక లాన్ టెన్నిస్ క్రీడలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఉత్తమ పోలీస్ అధికారికి అవసరమైన ప్రధాన గుణాలు ఇవేనని ప్రతి ఒక్క పోలీస్, పారా మిలటరీ సిబ్బంది ఈ గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. పోలీస్ దళాల మధ్య సోదర భావం, సహకారం, ఆరోగ్యకరమైన పోటీ భావనను ఇలాంటి క్రీడలు ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఈ క్రీడా వేదిక కేవలం క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మాత్రమే కాదని, జాతీయ ఐక్యత, పరస్పర గౌరవం, పోలీస్ కుటుంబాల మధ్య ఐక్యతను పెంపొందించుకునే వేదిక కూడా అని పేర్కొన్నారు. మంగళవారం రోజున న్యూఢిల్లీలోని ఆర్.కె.ఖన్నా స్టేడియంలో నిర్వహిస్తున్న 26వ ఆల్ ఇండియా పోలీస్ లాన్ టెన్నిస్ చాంపియన్‌షిప్2026 ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐటిబిపి డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్, ప్రఖ్యాత టెన్నిస్ క్రీడాకారిణి రియా భాటియా, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోటీలో పాల్గొంటున్న జట్లకు సంబంధించిన జెండాలను ఎగరేశారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రారంభించే ముందు జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు.. ఈ రోజు నిర్వహిస్తున్న '26వ ఆల్ ఇండియా పోలీస్ లాన్–టెన్నిస్ ఛాంపియన్‌షిప్' కేవలం క్రీడా సంబరం మాత్రమే కాదు. ఇది మన పోలీస్, భద్రతా దళాల క్రమశిక్షణ, అంకితభావం, ఉత్తమ పనితీరు కనబరిచే ఒక మంచి వేదిక. అంతర్గత భద్రత , లా అండ్ ఆర్డర్ నిర్వహణ నుండి దేశ సరిహద్దులను రక్షించడం వరకు పోలీసులు, భద్రతా దళాలు అనేక సవాళ్లతో బాధ్యతలను నిర్వర్తిస్తుంటాయి. అలాంటి సందర్భాల్లో నిర్వహించే ఇట్లాంటి క్రీడలు వారి శారీరక దృఢత్వం , మానసిక ధైర్యం , టీమ్ స్పిరిట్ ను మరింత బలోపేతం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. లాన్ టెన్నిస్ అనే క్రీడ ఏకాగ్రతకు, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యానికి, సమతుల్యతకు, రణతంత్ర ఆలోచన వంటి లక్షణాలను అభివృద్ధి చేస్తుంది. ఒక ఉత్తమ పోలీస్ అధికారికి అవసరమైన ప్రధాన గుణాలు ఇవే. పోలీస్ దళాల మధ్య సోదర భావం, సహకారం, ఆరోగ్యకరమైన పోటీ భావనను ఈ క్రీడలు ప్రోత్సహిస్తాయి. ఇక్కడ క్రీడాకారులు కేవలం పోటీ మాత్రమే చేయడం లేదు. ఒకరినొకరు నేర్చుకుంటారు. అనుభవాలను పంచుకుంటారు. కొత్త ప్రేరణతో తిరిగి విధులు నిర్వర్తిస్తారు. ఈ వేదిక కేవలం మీ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మాత్రమే కాదు. జాతీయ ఐక్యత, పరస్పర గౌరవం, పోలీస్ కుటుంబాల మధ్య ఐక్యతను మరింత బలపరిచే అవకాశం కూడా. భారత ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో "ఖేలో ఇండియా," "ఫిట్ ఇండియా," "ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్" వంటి కార్యక్రమాల ద్వారా దేశంలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచుతున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నాయకత్వంలో మన పోలీస్, అర్ధ సైనిక దళాల్లో కూడా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎందుకంటే ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, ఉత్సాహంగా ఉన్న దళమే దేశ భద్రతను అత్యుత్తమంగా కాపాడగలదు. ఈ సంవత్సరం ఈ ప్రతిష్ఠాత్మక పోటీకి ఐటీబీపీకి ఆతిథ్యం ఇవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. హిమాలయ సరిహద్దుల్లో ధైర్యంగా సేవ చేస్తున్న ఐటీబీపీ హిమవీరులు, క్రీడా రంగంలో కూడా మంచి ప్రదర్శన చేస్తూ వస్తున్నారు. క్రీడల్లో పోటీ అంటే గెలుపోటములే కాదు, మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, కొత్త ఉత్సాహం పొందడానికి, జాతీయ ఐక్యత, సహకార భావనను పెంచడానికి ఒక మంచి అవకాశం. దేశం నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీల ద్వారా వీటిని అలవర్చుకుని అత్యుత్తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి మరపురాని అనుభూతికి ఈ టోర్న్ మెంట్ ను మార్చాలని కోరుతున్నా.

# హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పోటీలో సురేందర్ రెడ్డి దూకుడు

- సమస్యపై సమరం చేస్తూ సబ్బండవర్ణాల కోసం అండగా నిలుస్తూ ముందుకు
- హైకోర్టు న్యాయవాదులందరి చూపు సురేందర్ రెడ్డి వైపే





**హైదరాబాద్ వెలుతురు మార్చి 24:**
ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్న తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి రేసు ఉన్న అడ్వకేట్ సురేందర్ రెడ్డి దూసుకెళ్తున్నారు. 2026 మార్చి 26న జరగనున్న ఎన్నికల్లో న్యాయవాద వర్గాలన్నింటిల్లో ఆయన పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుండి వచ్చిన ఆయన తన గురువులు, సీనియర్ కౌన్సెల్ వి. రవి కిరణ్ రావు, ఏపీ హైకోర్టు అదనపు అడ్వకేట్ జనరల్ ఇ. సాంబశివ ప్రతాప్ మద్దతుతో అంకితభావంతో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించారు. వృత్తి పట్ల నిలువెత్తు నిజాయితీ, అంకితభావం, సమగ్రత, నిబద్ధత అనే విలువలను తొలి నుంచి కాపాడుతూ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల్లో సుమారు 28 సంవత్సరాల సక్సెస్‌ఫుల్ అడ్వకేట్ గా సేవలు అందించిన చరిత్ర సురేందర్ రెడ్డికి ఉన్నది. ఇదే హైకోర్టులో ఆయన 7,000 కేసులను వాదించిన రికార్డు సైతం ఉన్నది. పార్కింగ్ సమస్యలు, కేసులు దాఖలు చేయడం, కేసు పోస్టింగ్‌లు, ఆర్డర్ కాపీలను స్వీకరించడంలో జాప్యం, రెగ్యులర్ ప్రాక్టీషనర్‌గా ఉండటం వల్ల యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సవాళ్ళపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉన్నది. హైకోర్టులో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు, ఇబ్బందులను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడానికి ఆయన చాలా ఆచరణాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ఎన్నికైన వెంటనే అవసరమైన మార్పులను అమలు చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానని చెబుతూ సంచలనం సృష్టిస్తున్నారు. తెలంగాణ హైకోర్టులో విభిన్న నేపథ్యాల నుండి అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అందుచేత, వారికి కోర్టులో అందే సౌకర్యాలపై ప్రత్యేక కృషి అనివార్యమని అందరూ అభిప్రాయపడుతున్నారు. న్యాయవాదుల ఆరోగ్యం పరిరక్షించేందుకు కోర్టు ప్రాంగణంలో అవసరమైన వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి సురేందర్ రెడ్డి హామీలు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది. అధ్యక్ష పోటీలో ఉన్న ప్రముఖ అడ్వకేట్ సురేందర్ రెడ్డి ఇదివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా (2006–07), కోశాధికారిగా (2008–09), కార్యదర్శిగా (2011–12) తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడిగా (2017–18) పనిచేసిన అనుభవం ఉన్నది. ఆయన పదవీకాలంలో, గత అధ్యక్షుల సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణ హైకోర్టు గౌరవం, మర్యాదను నిలబెట్టుకున్నది. ఇందులో ఆయన కృషి ఎంతగానో ఉన్నది. హైకోర్టులో లైబ్రరీని పునరుద్ధరించడం, ఖాతాలలో పారదర్శకతను ప్రవేశపెట్టడంలో సురేందర్ రెడ్డి సేవలు ఎంతో విశిష్టమైనవి. ప్రస్తుత ఎన్నికల్లో కూడా అంతే నిబద్ధతతో సభ్యుల సంక్షేమం కోసం పని చేస్తానని చెబుతూ ఎన్నికల్లో విస్తృతం ప్రచారం చేస్తున్నారు. ఆయన హామీలు, వ్యాఖ్యలు న్యాయవాదుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తున్నాయి. 2026–27 సంవత్సరానికి తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవాలని అభ్యర్థిస్తున్నారు. హైకోర్టు న్యాయవాదుల ఫిర్యాదులను పరిష్కరిస్తానని బెంచ్ అండ్ బార్ మధ్య స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించడం ద్వారా ముందుకు అడుగులు వేస్తున్నారు. అయితే, అపార అనుభవం ఉన్న సురేందర్ రెడ్డికే అన్నివర్గాల మద్ధతు లభిస్తుండటం గమనార్హం. న్యాయవాదులు, బయటివర్గం వారు కూడా ఆయన గెలుపును కోరుకోవడం సర్వత్రా ఆసక్తికరంగా నిలిచింది.






వెలుతురు




# పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.







## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు

### సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజ్రీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

## దురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు



**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) మార్చ్ 24 :** తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం. అలాంటిది మీరు 'ధురందర్ 2'ను తప్పక చూడాల్సిన చిత్రం అని చెప్పడం నా జీవితంలో అతిపెద్ద 'సూపర్‌స్టార్' మూమెంట్‌గా అనిపిస్తోంది. పెద్ద కలలు కనేలా మమ్మల్ని ప్రోత్సహించిన వ్యక్తి నుంచి అందిన ఈ ప్రశంస ఒక వరంలా ఉంది. మీ మాటలకు నా హృదయం ఉప్పొంగుతోంది' అని దర్శకుడు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. మార్చి 19న విడుదలైన 'ధురంధర్ 2' చరిత్ర సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.750 కోట్ల మార్కును దాటి రికార్డులు తిరగరాస్తోంది. రజనీకాంత్‌తో పాటు అల్లు అర్జున్, మహేశ్ బాబు, నాగార్జున వంటి ఇతర అగ్ర తారలు కూడా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే.










## శ్రీలీల ట్రాక్ చూసేందుకు మహిళల ఆసక్తి

### ఉస్తాద్ భగస్ సింగ్‌పై హరీష్ శంకర్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్నవిధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.



## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷-లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ంఎ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.



# నగరంలో పెట్రోల్,డీజిల్ కొరత లేదు

**- బంకుల వద్ద బారులు తీరవద్దు**

**- సోషల్ మీడియా పుకార్లు నమ్మొద్దు: కమిషనర్**



**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. నగరంలో ఇంధన నిల్వలు నిండుకున్నాయనేది కేవలం అపోహ మాత్రమేనని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.నగరవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల దగ్గర సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా ఎక్కడా ఆగిపోలేదని సీపీ తెలిపారు. కొరత ఉందన్న ఆందోళనతో పెట్రోల్ బంకుల వద్ద భారీగా క్యూ కట్టవద్దని, అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, రవాణా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయవద్దని సీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. నగరంలో సాధారణ పరిస్థితులు కొనసాగేందుకు ప్రజలందరూ సహకరించాలని సీపీ కోరారు. రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బంకుల వద్ద బారులు తీరవద్దని సూచించారు. సోషల్ మీడియా పుకార్లు నమ్మవద్దన్నారు.

# ఎపిలో ఉగ్రలింకుల కలకలం

**- విజయవాడలో ముగ్గురు యువకుల అరెస్ట్**



**విజయవాడ,మార్చి24( వెలుతురు):**
ఏపీలో ఉగ్రలింకులు కలకలం రేపాయి. ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయనే అనుమానంతో విజయవాడలో ముగ్గురు యువకులను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వించిపేటకు చెందిన ఇద్దరు 21 ఏళ్ల యువకులతో పాటు, భవానీపురానికి చెందిన 20 ఏళ్ల యువకుడిని అరెస్టు చేసి రహస్యంగా విచారిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సోషల్‌మీడియా కార్యకలాపాలపైనా దృష్టిసారించారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ పోలీసులు.. వారి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విదేశాల్లో ఉగ్రవాద చర్యలకు ఆకర్షితులై సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినట్లుగా ముగ్గురు యువకులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరిని రహస్యప్రదేశంలో విచారిస్తున్నారు. వీరికి ఏ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి? వీరిని ఉగ్రవాదం వైపు ఎవరు ప్రేరేపిస్తున్నారు? వీరికి సోషల్‌మీడియా లింకులు ఎలా వస్తున్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ టెర్రర్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్ర కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన మహిళతో సంబంధాలు ఉన్నట్లుగా సమాచారం. ఆ మహిళే కీలక సూత్రధారి అని పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ముగ్గురు అనుమానితుల్ని అరెస్టు చేసిన వెంటనే.. ఆమె పరారవ్వడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

# రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా రింకూ సింగ్

**- నియామక పత్రం అందించి అభినందించిన సిఎం యోగి**

**లక్నో,మార్చి24( వెలుతురు):**
టీమిండియా పవర్ హిట్టర్, టీ20 ప్రపంచ కప్ 2026 విజేత రింకు సింగ్‌కు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. అతడిని రీజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా యోగి సర్కార్ నియమించింది. ఈ మేరకు మంగళవారం లఖ్‌నవూలోని లోక్ భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నియామక పత్రాన్ని రింకుకు సీఎం యోగి ఆదిత్య నాథ్ అందజేశారు. పొట్టి ప్రపంచం కప్ సమయంలోనే రింకు తండ్రి మరణించిన సంగతి తెలిసిందే. అంతటి విషాదంలో ఉండి కూడా తండ్రి అంత్యక్రియలు ముగిసిన వెంటనే తిరిగి జట్టుతో చేరి తన అంకిత భావాన్ని చాటుకున్నాడు. రింకు టీ20 ప్రపంచ కప్ 2026లో మొత్తం 5 ఇన్నింగ్స్‌లో 24 పరుగులు మాత్రమే చేశాడు. ఈ అన్ని మ్యాచ్‌లలో అతడు ఆఖరిలో బ్యాటింగ్‌కు వచ్చాడు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 4 బంతుల్లోనే 11 పరుగులు చేశాడు.ప్రపంచ కప్ 2026లో అతడి అంకితభావానికి గుర్తింపుగా యోగి ప్రభుత్వం ఈ ఉద్యోగంతో సత్కరించింది. రింకు సింగ్ పొందిన పోస్ట్ గ్రూప్-ఏ కిందికి వస్తుంది. జీతం, అలవెన్సులతో కలిపి రూ. 70,000 వరకు చేతికి అందుతుంది. ఇక రింకు సింగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మరో ఐదుగురు అథ్లెట్లకు కూడా యూపీ ప్రభుత్వం ఉద్యోగాలను ప్రకటించింది. రాజ్‌కుమార్ పాల్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా హైజంప్), అజిత్ సింగ్, సిమ్రాన్‌లను కూడా గ్రూప్-1లో వివిధ పోస్టుల్లో యూపీ ప్రభుత్వం నియమించింది. 2024-25 సంవత్సరానికి గాను తొమ్మిది మంది క్రీడాకారులకు రాష్ట్ర అత్యున్నత పురస్కారాలైన లక్ష్మణ్ అవార్డు, రాణి లక్ష్మీబాయి అవార్డులను అందజేశారు. వీరికి రూ. 3.11 లక్షల నగదు బహుమతితో పాటు కాంస్య విగ్రహాన్ని బహూకరించారు.



# భద్రాద్రిలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

**- 27న కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు**

**భద్రాచలం,మార్చి24( వెలుతురు):**
భద్రగిరిలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేం దుకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం నిమగ్నమయ్యింది. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం కూడా ఆదేశించింది. గవర్నర్, సిఎంలకు కూడా ఇప్పటికే ఆహ్వానాలు అందచేశారు. 27న జరిగే సీతారాముల కల్యాణం, 28న జరిగే మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పూర్తిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆమె హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వంహించారు. ఈ వీసీకి భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన కార్యాచరణతో పని చేయాలన్నారు. ఇక నవమి రోజున 27న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రానున్నారని, అదేరోజు ఆయన చేతుల మీదుగా ఆలయాభివృద్ధి పనులకు భూమి



పూజ కార్యక్రమం ఉంటుందని.. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శిలాఫలం ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. ఇక పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ , తదిత భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. మిథిలా స్టేడియంలో ప్రజాప్రతినిధులు, వీవీఐపీలు, వీఐపీలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శిఇప3. తూణభద్రాచలంలో మిథిలా స్టేడియంలో జరుగుతున్న శ్రీరామనవమి ఏర్పాట్లను కలెక్టర్ అంకిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. 26న ఉదయం 9గంటల వరకు సబ్‌కలెక్టరు కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వీవీఐపీ, వీఐపీలకు బస చేసే అతిథి గృహాలకు నియమితులైన సెక్టారల్ అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లు, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీఐపీల వెంట వచ్చే సిబ్బంది ఎవరైనా గొడవలకు దిగితే పోలీసు సహకారం తీసుకొని సర్దుబాటు చేయాలని, దేవుడి దగ్గర అందరూ సమానమే అన్నారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి బిఆర్‌ఎస్ విద్యార్థుల యత్నం

**- అడ్డుకున్న పోలీసులు..పలువురి అరెస్ట**

**- ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్**

**హైదరాబాద్,మార్చి24( వెలుతురు):**
అసెంబ్లీ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ నాయకులు మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తం అయిన పోలీసులు బీఆర్‌ఎస్వీ కార్యకర్తలను అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, వాహనాల్లో నాంపల్లి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యారంగంపై సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్వీ నాయకులు ఇవాళ అసెంబ్లీని ముట్టడించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగం పై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విడతల వారీగా బీఆర్‌ఎస్వీ నాయకులు అసెంబ్లీ




ముట్టడికి వస్తుండటంతో వారిని అడ్డుకోవడానికి పోలీసులు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఇవాళ బీఆర్‌ఎస్వీ నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ.. ఉద్యమాలను అణిచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యం అనిపించు కోదని అన్నారు. ఇది రాజ్యాంగ హక్కులను హరించడమే అని స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. గురుకులాలను పట్టించు కోవడం లేదని.. ప్రభుత్వ బడులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వారు విమర్శించారు. నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. విద్యారంగంపై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పుచ్చుకుంటుందని కాంగ్రెస్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు.

# అమరావతిలో మరోమారు అగ్నిప్రమాదం

**- వరుస ప్రమాదాలపై చంద్రబాబు అనుమానం**

**- దర్యాప్తు చేసి నిగ్గు తేల్చాలని ఆదేశం**

**అమరావతి,మార్చి24( వెలుతురు):**
రాజధాని అమరావతిలో మరోసారి భారీ అగ్నిప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి రాయపూడి సమీపంలో ప్రిన్సిపల్ సెక్రటరీల భవనాల వద్ద నిర్మాణ ప్రాంగణంలో చోటు చేసుకుంది. కాంట్రాక్టు సంస్థ మేఘా కంపెనీకి చెందిన ప్లాస్టిక్ పైపుల వద్ద అకస్మాత్తుగా నిప్పులు చెలరేగాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అమరావతిలో ఇటీవల కూడా భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 11న ఎల్ అండ్ టీకి చెందిన



ప్లాస్టిక్ పైపులు తగలబడటంతో కోట్లాది రూపాయల నష్టం జరిగింది. రాజధాని అమరావతిలోని ప్రాంతం రాయపూడిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో మంగళవారం సమీక్ష చేశారు. రాయపూడిలో హెచ్‌వోడీ టవర్ల నిర్మాణం వద్ద మెగా సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు రాత్రి దగ్ధమైన ఘటనపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో తరుచూ అగ్నిప్రమాదాలు జరగడంపై సీఎం అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదమా, కుట్రకోణం ఉందా అనే విషయంలో సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే మూడు ఘటనల్లో వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన నిర్మాణ సామాగ్రి దగ్ధమైందని తెలిపారు. రాజధాని అమరావతిలోని రాయపూడి వద్ద నూతనంగా నిర్మిస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారుల టవర్ల సమీపంలో పైపులు కాలిపోయాయి. ఇది ప్రమాదమా...?, కుట్రకోణమా అనే దానిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల వెలగపూడి సమీపంలో సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కొందరు ఉద్దేశపూర్వకంగా పైపులకు నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అలాగే మెగా సంస్థకు చెందిన పైపులకు కొందరు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

# పార్లమెంటులో వైసిపికి 11 వనంబర్ గది

**- కంగారుతో మార్చాలని స్పీకర్‌కు వినతి**

**- 12 నంబరు కేటాయిస్తూ ఆదేశాలు**

**న్యూఢిల్లీ,మార్చి24( వెలుతురు):**
ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో గదుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, '11' అనే సంఖ్యకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధం ఈ ఘటనతో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. కొత్త పార్లమెంటు భవనంలో ఆయా పార్టీల బలాబలాలను చూసి స్పీకర్ కార్యాలయం గదులను కేటాయిస్తుంది. అయితే వైసీపీ ఎంపీలకు కేటాయించిన గది నంబర్ వారిని తీవ్ర కలవరానికి గురిచేసింది. స్పీకర్ కార్యాలయం మొదట వైసీపీకి మొదటి అంతస్తులో 11వ నంబర్ గదిని కేటాయించింది. ఈ నంబర్ చూడగానే వైసీపీ ఎంపీలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు వైసీపీని '11' అంటూ ఎద్దేవా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు పార్లమెంటులో కూడా అదే నంబర్ రావడం ఫ్యాన్ పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. తమకు ఇచ్చిన గది నంబర్ మార్చాలని కోరుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలు హుటాహుటిన స్పీకర్‌ను కలిశారు. 11వ నంబర్ గదిని ఎందుకు వద్దంటున్నారని స్పీకర్ ప్రశ్నించగా.. ఆ




నంబర్ తమకు కలిసి రావడం లేదని, ఏపీలో తమ పార్టీ గెలిచిన సీట్ల సంఖ్య కూడా అదే కావడంతో అందరూ హేళన చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతలు వివరించారు. ఆ పార్టీ ఎంపీల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్, వారికి 12వ నంబర్ గదిని కేటాయించారు. దీంతో వైసీపీ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. రాజకీయాల్లో సంఖ్యాశాస్త్రం సెంటిమెంట్లకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఈ ఘటన నిరూపిస్తోంది. ఒకప్పుడు 151 సీట్లతో రికార్డు సృష్టించిన పార్టీ, ఇప్పుడు '11' అనే అంకెను చూసి భయపడటం రాజకీయ విచిత్రమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి పార్లమెంటు మొదటి అంతస్తులో 9వ నంబర్ గదిని కేటాయించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోండటంతో, ప్రధానమైన గదుల్లో ఒకటి వారికి దక్కింది.

# మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వరం

**- ఇక్కడి పారిశ్రామిక అభివృద్ధిలో కీలకం**

**- కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు**

**న్యూఢిల్లీ,మార్చి24( వెలుతురు):**
అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com